




ఆర్‌యూ రుణం తీర్చుకోండి

- ప్రతి విద్యార్థికి ఉన్నత విద్య కీలకం
- కలను సాకారం చేసుకోండి
- తల్లిదండ్రులు, గురువులను గౌరవించండి
- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- రాయలసీమ వర్సిటీలో ఘనంగా నాలుగో స్నాతకోత్సవం
- విద్యార్థులకు బంగారు పతకాలు, డాక్టరేట్ల ప్రదానం





మాట్లాడుతున్న గౌవర్నర్, వీసీ





కర్నూలు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదర్శంగా, ఉన్నతంగా తీర్చిదిద్దిన రాయలసీమ వర్సిటీతో పాటు సమాజానికి రుణం తీర్చుకోవాలని గవర్నర్, వర్సిటీ ఛాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. దేశ ప్రగతి రథానికి విద్యార్థులు చోదకశక్తిగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఆకాంక్షించారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలో 4వ స్నాతకోత్సవం (కాన్వకేషన్)కు ఛాన్సలర్ హోదాలో హాజరు అయ్యారు. ఆయనతో పాటు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, వైస్ ఛాన్సలర్ వి.వెంకట బసవరావు, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయ్‌కుమార్ నాయుడు వేదికపైకి చేరుకున్నారు. కలెక్టర్ డాక్టర్ సిరి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అంతకుముందు యూనివర్సిటీ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్‌కు ఎన్‌సీసీ, పోలీస్ బెటాలియన్ బృందాలు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం డాక్టరేట్ అందుకోబోయే వారు గవర్నర్‌తో కలిసి విడివిడిగా ఫొటోలు తీయించుకున్నారు. అక్కడి నుంచి డాక్టరేట్ దుస్తుల్లో మేళ తాళాల నడుమ వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం సభ వేదికలో గవర్నర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ఉన్నత విద్య కీలకం అన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో పాటు గురువులను గౌరవించాలన్నారు. ఉన్నత విద్యలో మహిళలు రాణించడం ఎంతో అభినందనీయమన్నారు. రాబోయే స్నాతకోత్సవానికి కూడా తాను తప్పకుండా వస్తానని, అప్పుడు విద్యార్థులు ఎలా చదువుతున్నారో చూస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పరిశ్రమలు, అవకాశాలను యువత కోసం తెచ్చి ఆర్థికంగా దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని తపన పడుతున్నాయన్నారు.

మిగతా 6లో...



రాయలసీమ వర్సిటీలో ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం



వర్సిటీ కీలక అధికారులతో గవర్నర్ అబ్దుల్ నజీర్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న డాక్టర్ ఎస్ఎస్‌వీ రామకుమార్

సత్వర న్యాయానికి జాతీయ లోక్ అదాలత్

- కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి



జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయాధికారులతో సమీక్షిస్తున్న కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి

కర్నూలు లీగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు డిసెంబరు 13వ తేదీ జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి పిలుపునిచ్చారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌పై బుధవారం స్థానిక జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో న్యాయాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులే కాక.. ప్రి లిటిగేషన్ కేసులను కూడా ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో విచారించి కక్షిదారులకు రాజీ మార్గంలో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించాలని అన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి వీలున్న క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, మోటారు యాక్సిడెంటు, చెక్‌బౌన్స్ కేసులే కాక సివిల్ కేసులను కూడా పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు కమలాదేవి, వాసు, లక్ష్మీరాజ్యం, సీబీఐ కోర్టు న్యాయాధికారి శోభారాణి, పోక్సో కోర్టు న్యాయాధికారి రాజేంద్ర బాబు, ఏసీబీ కోర్టు న్యాయాధికారి శ్రీవిద్య, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ ఎం. వెంకట హరినాథ్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, సీనియర్ సివిల్ జడ్జీలు మల్లేశ్వరి, దివాకర్ పాల్గొన్నారు.

కూల్చేస్తాం

- నిబంధనలు పాటించి తీరాల్సిందే..
- ఉత్తర్వులను జారీ చేసిన డీటీసీపీ
- సమాయత్తం అవుతున్న అధికారులు

ఆదోని టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ(బీపీఎస్)కు సంబంధించిన జీవోను విడుదల చేసే ముందు ప్రస్తుతం జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం కొరడా ఝళిపించనుంది. మంజూరు అయిన ప్లానుకు అదనంగా అంతస్తులను వెంటనే తొలగించాలని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) నుండి మున్సిపల్ అధికారులకు ఉత్తర్వులు అందాయి. దీంతో పట్టణ ప్రణాళిక అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు సమాయత్తమవుతున్నారు.



● ప్రభుత్వ ఉత్తర్వులు

ఆగస్టు 31వ తేదీ నుంచి జరిగిన అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించమని టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ మున్సిపల్ అధికారులకు ఉత్తర్వులను(ఆర్‌వోసీ నెం. 17/36/2019/పీ తేదీ 10/11/25) జారీ చేశారు. ప్రతి నిర్మాణానికి ప్లాను మంజూరు ఉండాలని, మంజూరు అయిన ప్లానుకు అదనంగా నిర్మాణాలను చేయరాదన్న నిబంధనలు ఉన్నా నిర్మాణదారులు వాటిని పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడటం, రాజకీయ నాయకుల జోక్యం కారణాలతో అక్రమ కట్టడాలు విపరీతంగా పెరిగిపోయాయి. వాటిని నివారించి, ఇకపై జరుగకుండా ఉండాలని ప్రభుత్వం ప్రస్తుతం కూల్చివేతలకు ఉత్తర్వులను జారీ చేసింది.

● వీటికి మినహాయింపు

31 ఆగస్టు వరకు నిర్మాణాలు పూర్తి అయిన అక్రమ నిర్మాణాలకు బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) కింద మినహాయించారు. వాటికి అపరాధ రుసుము చెల్లించి బీపీఎస్ కింద ప్లాను మంజూరుకు అవకాశం కల్పించారు. కట్ ఆఫ్ డేట్ తరువాత జరిగిన అక్రమ కట్టడాలను మాత్రమే కూల్చి వేయనున్నారు.

బెంబేలెత్తుతున్న నిర్మాణదారులు

ప్లాను మంజూరుకు అవకాశం లేని పాతబస్తీలోని చిన్న సందులలో రాజకీయ అండతో ప్లాను మంజూరు లేకుండానే నిర్మించుకుంటున్న కట్టడాలను కూల్చివేసే అవకాశం ఉంది. దీంతో ఇండ్ల యజమానులు బెంబేలెత్తి పోతున్నారు.

అక్రమ కట్టడాలు పూర్తిగా తగ్గి పోతాయి

● బాల ముద్దయ్య, టీపీవో

ప్రభుత్వ ఉత్తర్వులు అమలు జరిగితే ఇకపై అక్రమ కట్టడాలు చాలా వరకు తగ్గిపోతాయి. ప్లానుల మంజూరు సంఖ్య పెరిగి మున్సిపల్ ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

అస్తవ్యస్తం..

- సచివాలయాల్లో కొరవడిన సమయపాలన
- ముగ్గురు నలుగురు ఉద్యోగులపైనే పని భారం
- ఫీల్డ్ విజిట్ పేరిట విధులకు డుమ్మా
- ఎప్పుడొస్తారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి



కోసిగి మండలం చింతకుంటలో ఉద్యోగులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు



మంత్రాలయం మండలం చెట్నహళ్లిలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్/ కర్నూలు)

● కౌతాళం మండలం బాపురం సచివాలయంలో 9 మంది ఉద్యోగులకు గాను సర్వేయర్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, మహిళా పోలీస్ పోస్టులు మాత్రమే నియమించగా ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరిలో కూడా ముగ్గురు అధికారులు ఎప్పుడు హాజరయ్యేదీ వారికే తెలియదు. గ్రామస్థులను విచారిస్తే ఎప్పుడొస్తారో తెలియదు అంటున్నారు.

● కర్ణాటక సరిహద్దున ఉన్న హోలహర్వి మండలం చింతకుంట గ్రామంలో సచివాయలం-1లో పది మందికి గాను నలుగురు, సచివాలయం-2లో పది మందికి గాను ఐదుగురు ఉద్యోగులు మాత్రమే పని చేస్తున్నారు. మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత సోమవారం సచివాలయం-2లో వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్ మాత్రమే హాజరయ్యారు. సర్వేయర్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు ఫీల్డ్ విజిట్ పేరిట సచివాలయానికి రాలేదు.

● ఆదోని పట్టణం అరుణ్‌జ్యోతి నగర్ 8వ వార్డు సచివాలయంలో 9 మంది ఉద్యోగులకు గాను నలుగురు రెగ్యులర్ కార్యదర్శులు ఉంటే ఐదుగురు ఇన్‌చార్జిలు పని చేస్తున్నారు. గత సోమవారం రెగ్యులర్ సిబ్బందిలో ఎడ్యుకేషన్, ప్లానింగ్ సెక్రెటరీలు 10:30 గంటల్లోగా హాజరు కాగా, మహిళా పోలీస్ మాత్రం మధ్యాహ్నం 12 గంటలైనా విధులకు హాజరు కాలేదు. ఇన్‌చార్జి అడ్మిన్‌గా ఉన్న వెల్ఫేర్ సెక్రెటరీ 11:35 గంటలకు వచ్చారు.

జిల్లాలో మెజార్టీ వార్డు, గ్రామ సచివాలయాల పరిస్థితి ఇదే. జిల్లా, తాలుకా, మండల కేంద్రాలకు దగ్గర్లో ఉన్న, రోడ్డు మార్గం, బస్సు సౌకర్యం అనుకూలంగా ఉన్న గ్రామ సచివాలయాల్లో ఉద్యోగుల హాజరు పర్లేదు అనిపించినా, మారుమూల గ్రామ సచివాయాల్లో సమయపాలన అస్తవ్యస్థంగా ఉంది. పట్టణ, నగరాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లకు పని ఒత్తిడి అధికంగా ఉంటుందని, మిగిలిన సిబ్బందికి ఆ స్థాయిలో పనులు ఉండడం లేదని అంటున్నారు. వార్డు, గ్రామ సచివాలయాల్లో ఉద్యోగుల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై 'ఆంధ్రజ్యోతి బృందాలు' క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దారుణ వాస్తవాలు వెలుగు చూశాయి.

జిల్లా వ్యాప్తంగా 672 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. 6.95 లక్షల కుటుంబాలు, 25.75 లక్షల జనాభా ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టాలనే ఆశయంలో కూటమి ప్రభుత్వం వచ్చాక పలు మార్పులు చేసింది. నివాస గృహాలు, కుటుంబాలను మ్యాపింగ్ చేశారు. రెండు సచివాలయాను కలిపి ఒక క్లస్టర్‌గా మార్చారు. అదే క్రమంలో ఒక్కో సచివాలయంలో 10-11 మంది సిబ్బంది ఉన్నా, వారికి సరైన జాబ్ చార్ట్ లేకపోవడంతో ఎవరు ఏ పని చేయాలో తెలియని పరిస్థితి ఉండేది. అదనపు సిబ్బంది భారం తగ్గించుకోవడానికి రీ-గ్రూపింగ్ విధానం తీసుకొచ్చారు. 2,500 జనాభాలోపు ఉంటే కేటగిరి-ఏ, 2,501-3,500 వరకు జనాభా ఉంటే కేటగిరి-బీ, 3,501 ఆపైన జనాభా ఉంటే కేటగిరి-సీగా గ్రామ, వార్డు సచివాలయాను విభజించారు. కేటగిరి-ఏ సచివాలయంలో ఆరుగురు, కేటగిరి-బీ సచివాలయంలో ఏడుగురు, కేటగిరి-సి సచివాలయంలో 8-10 మంది ఉద్యోగులు పని చేసేలా విధివిధానాలు తీసుకొచ్చారు.

కొందరికే పని భారం

గ్రామ సచివాలయాల్లో వీఆర్‌వో, వెల్ఫేర్ సెక్రెటరీ, డిజిటల్ అసిస్టెంట్, ఆరోగ్య కార్యకర్త, సర్వేయర్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, పశు సంవర్ధక సహాయకులు, మహిళా పోలీస్, ఎనర్జీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉంటారు. ఎనర్జీ, ఇంజనీరింగ్ రెండు విభాగాల్లో రెండు సచివాలయాలు కలిపి ఒకరు పని చేయాలి. వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్‌వోలకు పని భారం ఎక్కువగా ఉంటుందని తెలుస్తుంది. నగర, పట్టణలోని వార్డు సచివాలయాల్లో అడ్మిన్ సెక్రెటరీ, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, రెవిన్యూ సెక్రెటరీలు, ఏఎన్‌ఎం, ప్లానింగ్, అమినిటీస్ సెక్రెటరీ, శానిటేషన్ సెక్రెటరీ, వార్డు ఎనర్జీ సెక్రెటరీ, మహిళా పోలీస్‌లు ఉంటారు. అడ్మిన్, ఎడ్యుకేషన్, ప్లానింగ్, శానిటేషన్ సెక్రెటరీలకు పని భారం ఉంటుంది. మిలిగిన ఉద్యోగులకు ఆ స్థాయిలో పని భారం ఉండడం లేదని తెలుస్తుంది. ప్రతి నెల ఒకటో తారీఖు నుంచి 5 వరకు పింఛన్ల పంపిణీలో మాత్రం సచివాలయ సిబ్బంది అందరూ బిజీగా ఉంటారని తెలుస్తుంది. ప్రస్తుతం కౌశల, ఈకేవైసీ, ఐదేళ్లు దాటిన పిల్లల బయోమెట్రిక్, జియో క్వార్డినేట్ (ఇల్లు మారిన వారి వివరాలు సేకరణ) పనులున్నా కొందరిపైనే పని భారం అధికంగా ఉంటుందని తెలుస్తుంది.



గుడికల్లులోని 3వ సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు



ఆదోని మండలం సాంబగల్లులో సిబ్బంది లేని సచివాలయం

తాగునీటి పథకాల పనులు పూర్తి చేయాలి

గోనెగండ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తాగునీటి పథకాల పనులను అధికారులు, కాంట్రాక్టర్లు వేగంగా పూర్తి చేయాలని, వచ్చే ఏడాది వేసవిలో ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ అధికారులను ఆదేశించారు. బుధవారం గోనెగండ్ల మండలంలో గాజులదిన్నె ప్రాజెక్టులో నిర్మిస్తున్న ఇన్‌టెక్ వెల్, ఓహెచ్ఆర్ ట్యాంక్ ఇతర నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ పరిశీలించారు. అందుకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఇప్పటి వరకు ఎంత పని జరిగింది? మిగిలిన పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలజీవన్ మిషన్ పనులు ఎప్పటి లోగా పూర్తి చేస్తారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, డీఈ విద్యాసాగర్, ఏఈ శ్రీనివాసరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి ధర మరింత పతనం

- క్వింటా గరిష్ఠంగా రూ. 7,289



ఆదోని అగ్రికల్చర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు మరింత పతనమయ్యాయి. బుధవారం పత్తిధర క్వింటా గరిష్ఠంగా రూ.7,289కు పడిపోయింది. ధరలు పతనం కావడంతో పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస మద్దతు ధరతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోళ్లు ప్రారంభించిన యాప్ సాంకేతిక సమస్యతో రైతులు రిజిస్ట్రేషన్ కోసం ఇబ్బందులు పడుతున్నారు. సీసీఐ కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండడం నిబంధనలు అధికంగా ఉండడంతో రైతులు మార్కెట్‌లో తక్కువ ధరకే విక్రయించుకొని నష్టపోతున్నారు. 7,735 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ రూ.3,969, మధ్యస్థదర రూ.7,089, గరిష్ఠ ధర రూ.7,289 పలికింది.

హంద్రీకి జీడీపీ నీరు

- 4వ గేటు ఎత్తి 300 క్యూసెక్కులు విడుదల

గోనెగండ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి హంద్రీ నదికి బుధవారం కూడా నీటి విడుదల కొనసాగించారు. జీడీపీ ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు 4వ గేటు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని హంద్రీకి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో తుఫాన్ రానున్నట్లు వాతావరణ శాఖ సమాచారం ఇవ్వడంతో ముందస్తుగా జీడీపీ గేట్లు ఎత్తి నీరు విడుదల చేశారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ తదితర ప్రాంతాలలో అక్కడక్కడ అడపదడపా కురుస్తున్న వర్షాల కారణంగా హంద్రీ నుంచి రోజుకు 60 నుంచి 70 క్యూసెక్కుల నీరు వచ్చి చేరేది. ప్రస్తుతం గాజులదిన్నె ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రానికి నీటి మట్టం(3.9 టీఎంసీ) 375 మీటర్లు ఉంది. దీంతో జీడీపీ నిండుకుండలా మారింది. జీడీపీ పూర్తిస్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 2 మీటర్ల మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పీపీపీ విధానం తగదు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి
- ఎస్టీబీసీ నుంచి జిల్లా పరిషత్ వరకు ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోట్ల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న పీపీపీ విధానం తగదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ విధానం రద్దు చేయాలని కోరుతూ బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో ఎస్టీబీసీ కళాశాల నుంచి జిల్లా పరిషత్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రూ.8వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమంగా ర్యాలీ నిర్వహించామన్నారు. రూ.లక్షల కోట్లు ఖర్చు పెట్టి అమరావతిని అభివృద్ధి చేస్తున్నప్పుడు రూ. ఐదు వేల కోట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు కేటాయిస్తే తప్పేంటి? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తమ బినామీల కోసమే మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నదని విమర్శించారు. ప్రైవేటీకరణను ఆపకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంటు పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, నగర మేయర్ బీవై. రామయ్య, నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్, కార్పొరేటర్లు యూనుస్ బాషా, రాజేశ్వరరెడ్డి, సత్యనారాయణమ్మ, మునెమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పీజీ విద్యను పూర్తి చేసి పట్టాలు పొందిన ఆనందంలో విద్యార్థులు



పీహెచ్‌డీ విద్యను పూర్తి చేసి డాక్టరేట్‌లను అందుకునేందుకు వచ్చిన రీసెర్చ్ స్కాలర్లు

ప్రతిభకు పట్టాభిషేకం

- ఆర్‌యూలో 75 మందికి గోల్డ్ మెడల్
- గవర్నర్, వీసీ చేతుల మీదుగా అందుకున్న విద్యార్థులు
- పండుగ వాతావరణంలో 4వ స్నాతకోత్సవం

కర్నూలు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో ఉన్నత చదువులు అభ్యసించిన విద్యార్థులకు అరుదైన గౌరవం దక్కింది. బుధవారం రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఉప కులపతి వి.వెంకట బసవరావు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి చేతుల మీదుగా 75 మంది విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఉన్నత చదువులు పూర్తి చేసుకుని డాక్టరేట్ కోసం వేలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. 4వ స్నాతకోత్సవంలో భాగంగా పండుగ వాతావరణం మధ్య డాక్టరేట్ ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్న విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లో...

గవర్నర్ రాకతో ప్రాధాన్యత సంతరించుకుంది



ఆర్‌యూకు గవర్నర్ రావడం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. పట్టాల ప్రదానం గవర్నర్ చేతుల మీదుగా జరగడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో సంతోషిస్తున్నారు. గవర్నర్ పక్కలో నిలబడి డాక్టరేట్ తీసుకోవడాన్ని ఎంతో గ్రేట్‌గా ఫీలయ్యా..!

- జమీమా, పీజీ స్టాటిస్టిక్స్

గోల్డ్‌మెడల్ టార్గెట్‌గా పెట్టుకున్నా



స్నాతకోత్సవంలో గోల్డ్‌మెడల్ అందుకోవాలన్న లక్ష్యంతోనే చదివాను. ఫస్ట్ సెమిస్టర్ నుంచి కష్టపడి చదివాను. అనుకున్న లక్ష్యాన్ని సాధించాను. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చు. గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకోవడం ఆనందంగా ఉంది. బంగారు పతకంతో తల్లిదండ్రులకు, సొంతూరు, చదివిన విద్యా సంస్థకు మంచి పేరు తీసుకొచ్చాను.

- ప్రియదర్శిని, ఎంఎస్సీ, పీజీ

జీవితంలో మర్చిపోలేని రోజు



జీవితంలో మరచిపోలేని రోజు ఇది. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకోవడం అంటే మామూలు విషయం కాదు. ఇక్కడి గురువులు, తోటి విద్యార్థులతో కలిసి చదువుకున్న చదువుకు ప్రత్యేక గుర్తింపు ఉండిపోతుంది. కొందరి జీవితాల్లోనే ఇలాంటి సంఘటనలు జరుగుతుంటాయి. అందులో నేను ఉండటం గర్వంగా ఉంది.

- శ్రీహరి, బీటెక్, ఆర్‌యూ

చాలా గర్వంగా ఉంది



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకోవడం గర్వంగా ఉంది. ఏ నాడు ఇలాంటి రోజు వస్తుందనుకోలేదు. రాయలసీమ వర్సిటీలో చదువుకోవడం వల్ల ఇలాంటి అరుదైన అవకాశం వచ్చింది. ప్రతి విద్యార్థి క్యాంపస్ వాతావరణంలో చదువుకున్నప్పుడే సమాజంపై విలువ, బయట పరిస్థితులు అన్నీ అవగాహనకు వస్తాయి.

- పృథ్వీ, సివిల్ ఇంజనీరింగ్

గవర్నర్ చేతుల మీదుగా ఊహించలేదు



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటానని ఊహించలేదు. ఇంత మంది అతిథుల నడుమ ఇలాంటి పండుగ వాతావరణంలో గోల్డ్ మెడల్ అందుకోవడం ఆనందంగా ఉంది. చదివిన వర్సిటీలో ఇలాంటి అరుదైన అవకాశం లభించింది. మా తల్లిదండ్రుల కల నేరవేర్చాను.

- శ్రావణి, కామర్స్, పీజీ

తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూశా



మా అమ్మా నాన్న కళ్లలో ఆనందం చూశా. గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడంతో వారు ఎంతో సంబరపడ్డారు. వారి ప్రోత్సాహం వల్లే ఉన్న చదువులు పూర్తి చేయడంతో పాటు ఏకంగా రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాను. నాకు చాలా సంతోషంగా ఉంది.

- యశ్వంతి, ఈసీఈ, బీటెక్

అరుదైన అవకాశం



గవర్నర్ నజీర్ సార్ నుంచి బంగారు పతకం అందుకోవడం ఓ అరుదైన అవకాశం. ఇలాంటివి కొన్ని అనుకోకుండా జీవితంలో జరుగుతుంటాయి. గతంలో వర్సిటీలో జరిగిన మూడు కాన్వొకేషన్లలో గవర్నర్‌లు హాజరు కాలేదు. 4వ కాన్వకేషన్‌కు గవర్నర్ రావడం అంటే అదృష్టంగానే భావిస్తున్నా.

- గౌతమీ, ఎంఎస్సీ, పీజీ

గవర్నర్‌తో పట్టాలు పొందిన విద్యార్థులు



ఆయూ రుణం తీర్చుకోండి

(5వ పేజీ తరువాయి)



విద్యార్థినికి గోల్డ్‌మెడల్, డిగ్రీ పట్టాను అందజేస్తున్న గవర్నర్ నజీర్

ప్రభుత్వ ఉన్నత ఆశయాల్లో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమ యూనివర్సిటీకి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన పేరు ఉందని, ఇక్కడి వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఈ విద్యా సంస్థకు, సమాజానికి రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క విద్యార్థిపై ఉందన్నారు. ఇదిలా ఉండగా ఏఎం గ్రీన్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రామకుమార్‌కు యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. గవర్నర్ నుంచి డాక్టరేట్ అందుకున్న ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు విద్యుత్ రంగంలో తాను చేస్తున్న కృషికి గుర్తింపుగా తనను గౌరవించిన రాయలసీమ వర్సిటీకి రుణపడి ఉంటానన్నారు.

4వ స్నాతకోత్సవంలో...

డిగ్రీ పట్టాలు పొందిన వారు	18,396
పీజీ పూర్తి చేసిన విద్యార్థులు	246
బంగారు పతకాలు అందుకున్న వారు	75
పీహెచ్‌డీ డాక్టరేట్లు పొందిన వారు	140

వర్సిటీలో మెరుగైన వసతులు

- వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు

రాయలసీమ యూనివర్సిటి మెరుగైన వసతులు ఉన్నాయి. 1976 శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ కింద కొనసాగుతూ 1996లో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ కింద పీజీ సెంటర్‌గా రూపాంతరం చెంది, 2007లో రాయలసీమ యూనివర్సిటీగా ఏర్పడింది. అప్పటి నుండి ఒడిదుడుకుల మధ్య విద్యార్థులకు విద్యను అందిస్తూ, 2019లో ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేశాం. రీసెర్చ్ విభాగంతో ప్రతి విభాగానికి అత్యాధునిక ల్యాబ్‌లు, పరికరాలు, వసతుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాం. ప్రస్తుతం విద్యార్థుల అడ్మిషన్స్ కూడా పెరిగాయి. ప్రతి విద్యారికి ఉపాధి చూపించే లక్ష్యంగా పలు సంస్థలు, కంపెనీలతో ఇంటర్వ్యూలు నిర్వహించి ఉపాధి అవకాశాల కోసం జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాం. క్వాంటమ్ టెక్నాలజీని విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం.

విజయానికి విద్యే కీలకం

- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- ఘనంగా మాంటిస్సోరి స్వర్ణోత్సవాలు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయానికి విద్యే కీలకమని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని ఏ.క్యాంపులో ఉన్న మాంటిస్సోరి సీనియర్ సెకండరీ స్కూల్ స్వర్ణోత్సవాలకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మాంటిస్సోరి విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు కళ్యాణమ్మ విగ్రహానికి గవర్నర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అలాగే గోల్డెన్ జూబ్లీ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మాంటిస్సోరి విద్యాసంస్థలను కళ్యాణమ్మ అంకిత భావంతో విద్యారంగం అభివృద్ధికి కృషి చేశారన్నారు. వినూత్న బోధనా పద్ధతులను అమలు చేయడంలో మాంటిస్సోరి విద్యాసంస్థలు కృషి చేశాయన్నారు. ఈ విద్యా సంస్థలో చదివినవారు ఎంతోమంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, సైంటిస్టులు, డాక్టర్లు, ఇంజనీర్లు, ఐపీఎస్, ఐఏఎస్‌లుగా ఎదిగారన్నారు. అయితే జడ్జీలు, గవర్నర్‌లు ఎవరూ కాలేదా? అని ఆయన చమత్కరించారు. అసమానతలను తగ్గించడంలో విద్య ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ మాట్లాడతూ మాంటిస్సోరి విద్యాసంస్థలు సమాజంలో ఎంతోమందిని ఉన్నత స్థానాల్లో నిలిపేందుకు కృషి చేశాయన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మాంటిస్సోరి విద్యాసంస్థలు వేలాది మంది విద్యార్థులకు చదువుతో పాటు జ్ఞానం, మంచి నడవడికను నేర్పుతున్నాయన్నారు. గవర్నర్‌కు పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవ వందనం సమర్పించాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, మాంటిస్సోరి పాఠశాలల ఛైర్మన్ రాజశేఖర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వినూషారెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, పీబీవీ సుబ్బయ్య, కేజే రెడ్డి, అపుస్మా జిల్లా అధ్యక్షులు వాసుదేవయ్య, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, యుగంధర్, అధ్యాపకులు, విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



సభావేదికపై గవర్నర్‌తో పాటు కలెక్టర్ సిరి, టీజీ వెంకటేశ్, రాజశేఖర్, ఎంపీ నాగరాజు



హాజరైన అతిథులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్

చౌడేశ్వరీ మాత హుండీలో 52.10 లక్షలు



హుండీ లెక్కిస్తున్న భక్తులు

బనగానపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయం హుండీని బుధవారం లెక్కించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు హుండీని లెక్కించగా రూ.52.10 లక్షల నగదు, బంగారు, 44 గ్రాముల 510 మిల్లీ గ్రాముల బంగారు, వెండి ఒక కేజీ 710 గ్రాముల లభించినట్లు ఏసీ తెలిపారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ హరిశ్చంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల ఉపాధ్యాయుడికి అబ్దుల్ హక్‌అవార్డు

- ఉర్దూ భాషలో విశేష కృషికి గుర్తింపు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అంజద్‌బాషా సిద్ధిఖీ

నంద్యాల కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉర్దూభాషాభివృద్ధి, ఉర్దూ విద్యార్థులకు గుణాత్మకంగా విద్య అందించడం, విద్యార్థులలో నైతికవిలువలు పెంచడం వంటి కీలక కృషికి గుర్తింపుగా డా.అబ్దుల్ హక్ అవార్డును నంద్యాలకు చెందిన ఉర్దూ లాంగ్వేజ్ పండిట్‌గా విధులు నిర్వహిస్తున్న అంజద్‌బాషా సిద్ధిఖీ అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం అంజద్‌బాషా సిద్ధిఖీ మాట్లాడుతూ నవంబరు 11వతేదీ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఆ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం, మెమెంటో, రూ.125000 క్యాష్‌ప్రైజ్ అందించినట్లు తెలిపారు. అంజద్‌బాషా సిద్ధిఖీ స్థానిక కలీల్‌సిద్దికీ హైస్కూల్‌లో ఉర్దూ పండిట్‌గా పనిచేస్తున్నారు.

ఏపీకి పెట్టుబడులతో రండి



పారిశ్రామిక వేత్తలతో నిర్వహించిన సమావేశంలో ఎంపీ

నంద్యాల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలు ఏపీకి పెట్టుబడులతో రావాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి కోరారు. బుధవారం న్యూ డిల్లీలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 వతేదీ విశాఖపట్టణంలో సీసీఐ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు!



తల్లీ బిడ్డలతో డాక్టర్ శశికళ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎన్‌ఆర్ పేటలోని సాహితి హాస్పిటల్‌లో ఏ. భారతి అనే మహిళ ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా వీపనగండ్ల మండలం దగడపల్లి గ్రామానికి చెందిన ఏ.భాస్కర్, ఏ.భారతి దంపతులకు మూడేళ్ల క్రితం పెళ్లయింది. సంతానం కలగకపోవడంతో భారతి నగరంలోని ఎన్‌ఆర్ పేటలోని సాహితి మెటర్నిటీ ఇన్‌ఫెర్టిలిటీ ప్రెగ్నెన్సీ కేర్ సెంటర్‌కు చెందిన ప్రసూతి వైద్యురాలు డాక్టర్ శశికళను సంప్రదించారు. మొదటి నెలలోనే భారతి అనే మహిళ గర్భం దాల్చడంతో గర్భంలో ముగ్గురు పిల్లలు ఉన్నట్లు డాక్టర్ శశికళ గుర్తించారు. ప్రతి నెలా రెగ్యులర్‌గా పరీక్షించి చికిత్స అందించారు. ఈ నెల 5వ తేదీ పురిటినొప్పులు రావడంతో సాహితి హాస్పిటల్‌లో గర్భిణీకి గైనిక్ వైద్యురాలు డా.శశికళ, అనస్తీషియా డాక్టర్ డా.రాంభూపాల్ రెడ్డి చిన్న పిల్లల వైద్యనిపుణులు డా.లక్ష్మీనారాయణ ఆపరేషన్ చేశారు. దీంతో ఆమె ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. మొదట ఆడపిల్ల 1.4 కేజీలు, రెండోసారి ఆడ పిల్ల 1.7 కేజీలు, మూడోసారి అబ్బాయి 1.4 కేజీలతో జన్మించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండటంతో బుధవారం వారు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు.

బస్సు ప్రమాద ఘటన

వీడియోలు వైరల్



శివశంకర్ మృతదేహం వద్ద ఎర్రిస్వామి, పక్కనే వెళ్తున్న బస్సు

కర్నూలు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు శివారులో గత నెల 24వ తేదీన జరిగిన బస్సు ప్రమాద ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రమాదం జరిగిన సమయం కంటే ముందు ఆ మార్గంలో వెళ్లిన ప్రైవేటు బస్సు డాష్కమ్‌లో రికార్డయిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. బైక్ యాక్సిడెంట్ తర్వాత శివశంకర్ కింద పడి మృతి చెందగా.. ఎర్రిస్వామి స్వల్ప గాయాలతో బయటపడి తానే శివశంకర్‌ను పక్కకు లాగానని పోలీసులకు చెప్పుకొచ్చాడు. దీనిపై గత కొద్ది కాలంగా అస్పష్టత నెలకొని ఉండేది. తాజాగా వైరల్ అయిన వీడియోతో బైక్ ప్రమాదం ముందే జరిగిందని ఎర్రిస్వామి చెప్పిన మాట నిజమేనని తెలిపాయి. ఈ ప్రమాదంలో బైక్ కుడి పక్కకు పడిపోగా.. మృతి చెందిన శివశంకర్‌ను ఎడమవైపునకు లాగిన దృశ్యాలు ఉన్నాయి. కొన్ని బస్సులు ఆ బైక్‌ను తప్పించుకుని వెళ్లిన వీడియోల దృశ్యాలు వీడియోలో కనిపించాయి. కానీ కావేరి ట్రావెల్స్ బస్సు మాత్రం తప్పించలేకపోవడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. దీంతో పాటు సమీపంలోని ఓ డాబాలో ఉన్న సీసీ పుటేజీ కూడా విడుదలైంది. ఇందులో వి. కావేరీ బస్సు ముందుకు రావడం, అందులో నుంచి క్షణాల్లో మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడటం స్పష్టంగా కనిపించాయి. సరిగ్గా రాత్రి 2:44 గంటలకు మంటలు వ్యాపించినట్లు వీడియోలో కనిపిస్తోంది. అంతకుముందు రాత్రి 2:25 నిమిషాలకు రోడ్డు ప్రమాదం జరగడం, ఆ సమయంలోనే శివ మృతదేహాన్ని స్నేహితుడు ఎర్రిస్వామి రోడ్డుపక్కకు లాక్కొని రావడం వీడియోల్లో కనపడుతోంది.



మెడికల్ కాలేజీలపై జగన్ మొసలి కన్నీరు

• ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

ప్యాపిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీలపై మాజీ సీఎం వైఎస్ జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీపీపీ విధానంతో రాష్ట్రంలో రెండేళ్లలో 1750 మెడికల్ సీట్లు పెరిగే అవకాశం ఉందని అన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సుదర్శన్, మామిళ్లపల్లి మోహన్ యాదవ్, బట్టా సత్యం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడిపై బైండోవర్ కేసు

• సీఎంను విమర్శిస్తే ఉపేక్షించమని ఎస్ఐ హెచ్చరిక

ఆలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ రైతు విభాగం ఆలూరు అధ్యక్షుడు అరికెర వెంకటేశ్వర్లుపై ఆలూరు పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. వైకుంఠం శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు రోజుల క్రితం ఈ కేసు నమోదు చేశారు. ఇలాంటి విమర్శలు ఎక్కడ చేసినా రౌడీషీట్ తెరుస్తామని ఎస్ఐ మన్మథవిజయ్ బుధవారం హెచ్చరించారు. ఈ విషయంపై ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆదేశాల మేరకు ఆయన సోదరుడు వెంకటేష్, వైసీపీ కార్యకర్తలు స్టేషన్ చేరుకుని అరికెర వెంకటేశ్వర్లుకు మద్దతుగా నిలిచారు.

ఆక్వా స్విమ్మింగ్ పోటీల్లో కర్నూలు జిల్లా ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఆక్వా స్విమ్మింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు పతకాలు వరించాయి. ఈ స్విమ్మింగ్ పోటీల్లో కర్నూలు జిల్లా బాలికలు కే.వైశాలి 400 మీటర్లు ఫ్రీస్టైల్‌లో గోల్డ్ మెడల్, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ బ్రౌంజ్ మెడల్, జూనియర్ కాలేజీ ప్యాపిలి చెందిన ఎం.అర్చన 800 మీటర్ల ఫ్రీస్టైల్ సిల్వర్ 200 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ బ్రౌంజ్, జడ్పీహెచ్ఎస్ ప్యాపిలి చెందిన పి.హేమలత 50 మీటర్ల బటర్ ఫ్లై గోల్డ్ మెడల్, 100 మీటర్ల బటర్ ఫ్లై గోల్డ్ మెడల్ 100 మీటర్లలో బ్యాక్ స్ట్రోక్‌లో బ్రౌంజ్ మెడల్, నారాయణ కాలేజీకి చెందిన జి.గోవర్ధని 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో 5వ రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించారని కోచ్ విజయలక్ష్మి, పీడీలను డీఈవో శామ్యూల్ పాల్, డీవీఈవో సురేష్ బాబు, ఆర్ఐవో జి.లాలెప్ప, డీఐఈవో శంకర్ నాయక్, ఉమ్మడి జిల్లాల ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ డీసీవో డా.ఐ.శ్రీదేవి ఆర్గనైజింగ్ సెక్రటరీ కే.రాఘవేంద్ర అభినందించారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం

• సురక్షితంగా బయట పడిన దంపతులు



ప్యాపిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏనుగమర్రి గ్రామం దగ్గర బుధవారం 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఒక కారు ఇంజన్‌లోంచి మంటలు వ్యాపించి వాహనం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న దంపతులు అప్రమత్తమై సురక్షితంగా బయట పడ్డారు. డోన్ పట్టణానికి చెందిన బ్రహ్మయ్య, ప్రశాంతి దంపతులు బ్యాంకు పని నిమిత్తం మారుతి కారులో పత్తికొండకు వెళ్లారు. అక్కడ పని ముగించుకొని తిరిగి డోన్‌కు బయలు దేరారు. మార్గమధ్యలోని ఏనుగమర్రి గ్రామం సమీపంలోని వనరుచి హోటల్ దగ్గరకు రాగానే కారు ఇంజన్‌లో పొగలు రావడం కనిపించారు. అప్రమత్తమైన దంపతులు కారు దిగి హోటల్‌లోకి వెళ్లారు. ఆ తర్వాత వెంటనే కారు మంటలకు పూర్తిగా దగ్ధమైంది. డోన్ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది.

రికార్డు రూమ్‌కు భద్రత కరువు



రికార్డు గదిలో అనధికారిక వ్యక్తి (సర్కిల్‌లో)

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న ప్రతి సమాచారం ఫైల్ రూపంలో భద్రపరిచే గదే రికార్డు గది. ఆ రికార్డు రూమ్‌కు కలెక్టర్ కార్యాలయంలో భద్రత కరువైంది. రికార్డు రూమ్‌లో అనధికారికంగా కొందరు వ్యక్తులు పని చేస్తున్నారు. ఇక్కడ ఫైల్‌లో నిక్షిప్తమైన సమాచారం. అత్యంత చాలా కీలకమైనది. కానీ అనధికారిక వ్యక్తులు కొన్ని ఫైల్ సమాచారాన్ని ఇతరులకు చేరవేస్తున్నారు. సమాచారం చేయడంతో పాటు సొమ్ము చేసుకుంటున్నారు. కనీసం రికార్డు రూమ్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పని చేయకపోవడం కొసమెరుపు. రికార్డు గదిని పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. బ్రిటీష్ కాలం నుంచి నేటి వరకు భద్రపరిచిన ఫైల్ పదిలంగా లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. రికార్డు గదిలోకి వెళ్లాలంటే కనీసం ఉన్నతాధికారులు అనుమతి ఉండాలి. అలా లేకపోవడంతో భద్రత వైఫల్యం స్పష్టంగా కనపడుతుంది. ఈ మేరకు డీఆర్వో వెంకట నారాయణమ్మ స్పందిస్తూ రికార్డు గదిలోకి అనధికారిక వ్యక్తులకు ప్రవేశం లేదు. అలా ఎవరైనా ఉంటే కచ్చితంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఐఎంఏ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): భారతీయ వైద్య సంఘం(ఐఎంఏ) నంద్యాల శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం బుధవారం ఘనంగా నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ శ్రీనివాసరావు, మహమ్మద్ రఫి, కోశాధికారిగా డాక్టర్ హరితతో పాటు మిగిలిన కార్యవర్గ తో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా మల్లీశ్వరి, లలిత, కోశాధికారిగా శశి కిరణ్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు మధుసూదనరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. 38 మంది వివిధ పదవీ బాధ్యతలను నంద్యాల ఐఎంఏలో 32 మహిళా వైద్య విభాగం బాధ్యతలను, 15 మంది ఏఎంఎస్ విభాగం బాధ్యతలను స్వీకరించారు.

అక్రమార్కుల చేపల రవాణా

- చోద్యం చూసిన ఎఫ్‌డీవో నాగరాజు
- రిజర్వాయరును తనిఖీ చేసిన మత్స్యశాఖ అధికారి రంగనాథ్‌బాబు
- 24 గంటల్లో ఖాళీ చేయాలని హెచ్చరికలు
- జిల్లా అధికారి ఆదేశాలు పట్టించుకోని అక్రమార్కులు



రిజర్వాయరు వద్ద హెచ్చరికలు జారీచేస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి



రిజర్వాయరు వద్ద అలాగే ఉన్న షెడ్లు

పత్తికొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పందికోన రిజర్వాయరులో అక్రమార్కుల ఆగడాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కట్టడి చేయాల్సిన మత్స్యశాఖ అధికారులు అక్రమార్కుల చేపల రవాణాను అడ్డుకట్ట వేయకుండా చోద్యం చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బుధవారం ఆంధ్రజ్యోతి పరిశీలనలో విస్తుపోయే దృశ్యాలు కనిపించాయి. మత్స్యశాఖ ఎఫ్‌డీఓ నాగరాజు కళ్లెదుటే అక్రమార్కులు రిజర్వాయరులో పట్టిన చేపలను బాక్సుల్లో నింపి దర్జాగా వాహనాల్లోకి ఎక్కించారు. అక్రమార్కులపై కేసులు పెట్టాల్సిన ఆ అధికారి చోద్యం చూస్తూ నిలుచోవడం గమనార్హం. అక్రమార్కుల నుండి రాజకీయ ఒత్తిళ్ల మేరకు అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారా లేక ఇతర కారణాలు ఉన్నాయా తెలియాల్సి ఉంది.

రిజర్వాయరును పరిశీలించిన జిల్లా మత్స్యశాఖ అధికారి

ఇదిలా ఉండగా మంగళవారం జిల్లా మత్స్యశాఖ అధికారి రంగనాథ్‌బాబు పందికోన రిజర్వాయరును పరిశీలించారు. చేపల వేట సాగిస్తున్న అక్రమార్కులకు నోటీసులు జారీచేయడంతోపాటు 24 గంటల్లో గుడిసెలు, పడవల తోపాటు అక్కడ ఉన్న సరంజామ మొత్తం ఖాళీ చేయాలని హెచ్చరికలు జారీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనాల ఆధారంగా చేపల అక్రమాల వేటపై విచారణకు వచ్చామన్నారు. 24 గంటల్లోగా ఖాళీచేయని పక్షంలో కాంట్రాక్టర్లు, సిబ్బంది, కూలీలపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. కాగా 24 గంటలు గడిచాక కూడా కూలీలు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయకపోగా మత్స్యశాఖ అధికారి కళ్లెదుటే పట్టిన చేపలను వాహనాలలో ఎక్కించారు. దీని ఆంతర్యం ఏమిటో తెలియాల్సి ఉంది. జిల్లా అధికారి హెచ్చరికలు జారీ చేసినా అక్రమార్కులు చేపలు పట్టడం ఆపలేదు. గుడిసెలు తొలగించక లేదు. ఇంత జరిగినా జిల్లా అధికారి వారిపై కేసులు నమోదుకాకపోవడం గమనార్హం.

రికవరీ చేయాలి

పందికోన రిజర్వాయరులో జూన్ 30కి గడువు ముగిసినప్పటికీ 4 నెలలు పైగా అక్రమార్కులు చేపల వేట సాగించారని, రూ. లక్షల్లో వారు దోచుకున్న సొమ్మును రికవరీ చేయాలని సీపీఐ నాయకులు బుధవారం అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. మండల, పట్టణ కార్యదర్శులు కారుమంచి, రామాంజనేయులు మాట్లాడుతూ గడువు ముగిసి నాలుగున్నర నెలలు గడిచినా కొందరు రిజర్వాయరులో అక్రమంగా చేపల వేట కొనసాగిస్తున్నారన్నారు. అధికారులు మామూళ్ల మత్తులో చూసీ చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు.

వైసీపీ అసత్య ఆరోపణలు

• బీజేపీ అధికార ప్రతినిధి వినూషారెడ్డి



మాట్లాడుతున్న వినూషారెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైద్యకళాశాలల ఏర్పాటులో పీపీపీ విధానంపై వైసీపీ చేస్తున్నది అసత్య ఆరోపణలు అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.వినూషా రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నెహ్రూనగర్‌లోని తన గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలను తప్పుదారి పట్టించి రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే ఈ ప్రచారం ఉద్దేశమన్నారు. పీపీపీ అంటే ప్రైవేటైజేషన్ కాదు అని, ఇది ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు అవుతుందన్నారు. వీటి కాలపరిమితి 33సంవత్సరాలు అమలులో ఉంటుం దన్నారు. భూమి, భవనాలు, కళాశాలలు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయన్నారు. వైసీపీ ప్రభుత్వం 17మెడికల్ కళాశాలలకు రూ.8,480కోట్లు అంచనా వేసి కేవలం రూ.1550 కోట్లు మాత్రమే ఐదు సంవత్సరాల్లో ఖర్చు చేసిందన్నారు. వైసీపీ పాలనలో జరిగిన టీటీడీ లడ్డూ, మద్యం కుంభకోణంపై సమాధానం చెప్పలేక ఆపార్టీ అబద్ధపు ప్రచారం చేస్తుందని, ప్రజలు ఈ తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు

బేతంచెర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన సయ్యద్ మహబూబ్ బాషా (41) అనే వ్యక్తి బుధవారం దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన సయ్యద్ మహబూబ్ బాషా గత రాత్రి తన ఇంట్లో ఉండగా, అదే గ్రామానికి చెందిన బోయ మధు భూపాల్ వచ్చి బల్లెంతో, రోకలిబండతో దాడి చేసి హత్య చేశాడు. మహబూబ్ బాషా భార్యతో బోయ మధు భూపాల్‌కు వివాహేతర సంబంధమే దీనికి కారణమని తెలుస్తోంది. బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమార్తె ఆసియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



శివయ్య(ఫైల్)

ఆళ్లగడ్డ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టిడ్కో గృహసముదాయంలో నివసిస్తున్న శివయ్య(48) గుర్తు తెలియని వాహనం ఢీకొని బుధవారం మృతి చెందాడు. శివయ్య ఆటో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి ఆటోలో పట్టణానికి వస్తుండగా జాతీయ రహదారిపై వెళుతున్న గుర్తు తెలియని వాహనం అతి వేగంగా ఢీ కొట్టింది. దీంతో శివయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆయనను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



నీతమ్మ (ఫైల్)

ఆళ్లగడ్డ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని ఎస్‌వీ నగర్ కాలనీకి చెందిన నీతమ్మ(40)బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. గత కొన్ని రోజులుగా నీతమ్మ మానసిక సమస్యలతో బాధపడుతున్నది. భర్త పలు ఆసుపత్రులలో ఆమెకు చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో ఆమెకు జీవితంపై విరక్తి కలిగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. టౌన్ పోలీసులు మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇండస్ట్రియల్ హబ్ చంద్రబాబు ఘనతే

• ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



ఎమ్మెల్యే గౌరు దంపతులను సన్మానిస్తున్న నాయకులు

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లుకు ఇండస్ట్రియల్ హబ్‌ను తీసుకువచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. ఓర్వకల్లులో జయరాజ్ ఇస్పాత్ తామే తీసుకువచ్చామని, పాణ్యంలో అభివృద్ధి తమ వల్లే సాధ్యమైందని మాజీ ఎమ్మెల్యే కాటసాని అనడం పట్ల గౌరుచరితారెడ్డి స్పందించారు. ఈవిషయంలో యాగంటీశ్వరుని చెంత ప్రమాణం చేస్తారా అంటూ స్పందించారు. 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తానని హామీ ఇచ్చి కృషిచేస్తున్నారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కె. పార్వతమ్మ, డైరెక్టర్లు రామాంజనేయులు, శ్రీనివాసరావు, పల్లె. ప్రభాకర్‌రెడ్డి, శైలజాయాదవ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో పీడీ ప్రతిభ

• అభినందించిన డీఈవో జనార్దన్‌రెడ్డి



ప్రతిభ కనపరిచిన బాషకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా లోని సంజామల మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న బాషా ఫిజికల్ డైరెక్టర్ ఇటీవల చెన్నైలో జరిగిన అంతర్జాతీయ పోటీలలో ఎంతో ప్రతిభ కనపరిచాడు. షాట్ పుట్ 40 విభాగంలో పాల్గొని పదో స్థానం సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో 10వ స్థానం సాధించిన పీడీకి జిల్లా విద్యా శాఖాధికారి జనార్దన్‌రెడ్డి జ్ఞాపికను, సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఇలాంటి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ప్రకాశం పాఠశాల విద్యార్థులు



ఉపాధ్యాయులతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రకాష్‌నగర్ టంగుటూరి ప్రకాశం పంతులు స్మారక నగర పాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారనీ వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 నెట్‌బాల్ పోటీలో సుప్రియ, సుస్మిత, గలుకలు, క్రీడలో తులసి, ఈరేష్, అండర్-14 విభాగంలో కీర్తన, గలకాలో అభిషేక్, టంగాట మార్షల్స్ గేమ్స్‌కు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే అండర్-17 టంగాట మార్షల్స్‌లో వీరేష్, భరత్, షమీనాపాజ్ శేఖర్, అండర్-19 విభాగం గటకా గేమ్‌లో ఆయేషా సిద్దికి, సాఫ్ట్ టెన్నిస్‌లో బి.విజయలక్ష్మి, అండర్-14 నెట్‌బాల్‌లో అభిషేక్, చిన్నారి, హాకీలో తేజశ్విని ఎంపికయ్యారు. పాఠశాల హెచ్ఎం ఖాజా సాహెబ్ క్రీడాకారులను పాఠశాల ప్రార్థనవేళలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం నాయకులు కోర్టుకు హాజరు



కోర్టుకు హాజరైన సర్పంచుల సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి దేవసింగ్ చౌహాన్‌ను 2023 డిసెంబర్ 16న కోడుమూరులో ఏపీ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో అడ్డుకోవడంతో అప్పట్లో నమోదైన కేసులో బుధవారం నగరంలోని కోర్టుకు ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్, సర్పంచుల సంఘం నాయకులు హాజరయ్యారు. ఈసందర్భంగా చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సర్పంచుల నిధులు విడుదల చేయాలని కోరుతూ తాము నిరసన తెలిపినందుకు ఈకేసు నమోదు చేశారన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భూమా వెంకట వేణుగోపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, ఉపాధ్యక్షురాలు భాగ్యరత్న కోర్టుకు హాజరయ్యారు.

ఉర్దూ వర్సిటీ పాలనపై ఆరా



ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న వీసీ

కర్నూలు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూవర్సిటీ పాలన తీరుపై ఉన్నత విద్యామండలి చైర్మన్ కె. మధుమూర్తి ఆరాతీశారు. బుధవారం వర్సిటీకి చేరుకున్న ఆయనకు ఉపకులపతి ప్రొఫెసర్ షావలిఖాన్ పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. వర్సిటీ అద్దెభవనంలో కొనసాగడంతోపాటు ఏమైనా ఇబ్బందులు, లోపాలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రార్ లోకానాథ్, ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మంత్రాలయం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర పురానికి చెందిన మల్లేశ్(48)అనే వ్యక్తి తన ఇంటి దగ్గర అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాలివీ.. మల్లేశ్‌కు మూర్ఛవ్యాధితో బాధపడుతుండేవాడు. బుధవారం సాయంత్రం ఇంటి ముందు ఉన్న కట్టమీదపడి రక్తపు మడుగులో మృతి చెందాడు. ఆయన భార్య రామమ్మ కూలీ పనులకు వెళ్లి రాత్రి చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మల్లేశ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మల్లేశ్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆర్ఐపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని 35వ వార్డులో ఇంటి పన్నులు వేయడానికి ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) డబ్బులు అడుగుతున్నాడని స్థానికులు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి ఫిర్యాదు చేశారు. బుధవారం ఇదే వార్డుల్లో పీఎంఏవై లబ్ధిదారుల ఇళ్ల పంపిణీకి వెళ్లిన ఎమ్మెల్యేను వారు కలిసి తమ గోడును వినిపించారు. ఇంటి పన్నులు వేయాలంటే డబ్బులు కచ్చితంగా ఇవ్వాలని ఆర్ఐ డిమాండ్ చేస్తున్నారని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. అక్కడే ఉన్న కమిషనర్ విశ్వనాథ్ స్పందించి ఆ ఆర్ఐపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకి సర్దిచెప్పారు. వివరాలు అందిస్తే అందరికీ ఇంటి పన్నులు వేయిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు.

హామీలను అమలు చేయాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురుశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, సంక్షేమానికి రూ.10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కోశాధికారి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి శేషాద్రి, రాముడు, జయమ్మ, ఉపాధ్యక్షులు బాబుశేఖర్ పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజల బతుకులను బజారుపాలు చేస్తున్న వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం అక్రమ వడ్డీవ్యాపారుల పీడన కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిజాముద్దీన్‌ను పరామర్శించారు. ఏసు రాజు, రాజ్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఐటీసీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా కోరారు. కొత్తబస్టాండు డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఐటీసీ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా ఉన్న రఘువరన్ పని ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఆయన మరణానికి కారణమైన యాజమాన్యంపై కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు హుస్సేన్‌బాషా, సహాయకార్యదర్శి ప్రకాష్ పాల్గొన్నారు.

పత్తిని కొనుగోలు చేయాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పత్తి పంటను క్వింటానికి రూ.12వేల చొప్పున కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్రకార్యదర్శి జగన్నాథం డిమాండ్ చేశారు. బుధవారం సీఆర్‌భవన్ వద్ద జెండా ఊపి ఆటోజాతను ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ పత్తి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు 18, 19 తేదీల్లో ఆదోనిలో రాష్ట్రస్థాయి సమ్మేళనాలు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, సీపీఐ నగర కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి మహేష్, భీసన్న, రాముడు, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



వినతి పత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

కోడుమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైసీపీ ఎస్ఈసీ సభ్యుడు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కోడుమూరు ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో బుధవారం భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోట్ల సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ 17 ప్రభుత్వం మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో ఐదు కాలేజీల నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన 12 మెడికల్ కళాశాలలకు గ్రహణం పట్టిందని ఎద్దేవా చేశారు. రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, కోడుమూరు జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, గూడూరు మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎంపీపీ సునీతమ్మ, రూతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు నీరు నింపాలి

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాల్వ ద్వారా మండలంలోని చెరువులకు నీరు నింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన ఉలిందకొండ చెరువును పరిశీలించారు. ఈసందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ హంద్రీనీవా కాల్వ మండలంలో ప్రవహిస్తున్నా ప్రజలకు తాగు, సాగునీరు అందించడంలో పాలకులు వైఫల్యం చెందారని ఆరోపించారు. ఉలిందకొండ, చిన్నటేకూరు, తడకనపల్లె గ్రామాల్లోని చెరువులకు నీరు నింపాలన్నారు. నాయకులు మధు, కృష్ణ, రాజు, కేశాలు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది' వినియోగించుకోండి

సి.బెళగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని సంగాల, గుండ్రేవుల గ్రామాల్లోని మొక్కజొన్న పంటలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈకేవైసీ తప్పనిసరి చేసుకోవాలని రైతులకు సూచించారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కుకు స్వాగతం పలుకుతున్న మంత్రి టీజీ భరత్, ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, దస్తగిరి, కలెక్టర్ సిరి



స్వాగతం పలుకుతున్న ఎస్పీ విక్రాంత్



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న విమానాశ్రయ డైరెక్టర్ విద్యాసాగర్

గవర్నర్ నజీర్‌కు ఘన స్వాగతం

ఓర్వకల్లు/ కర్నూలు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి కర్నూలు ఎయిర్‌పోర్టుకు ఉదయం 11.55 గంటలకు చేరుకున్నారు. ఇక్కడి నుంచి 12.05 గంటలకు ప్రత్యేక వాహనాల్లో కర్నూలుకు బయలుదేరి వెళ్లారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు వచ్చిన గవర్నర్‌కు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరుచరితారెడ్డి, దస్తగిరి, ఓర్వల్లు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్ ఘనస్వాగతం పలికారు. గవర్నర్ పర్యటనను ముగించుకుని 4.32నిమిషాలకు ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి ప్రత్యేక విమానంలో సాయంత్ర 4.42 గంటలకు విజయవాడకు బయలు దేరి వెళ్లారు. కలెక్టర్, ఎస్పీలు కలిసి గవర్నర్‌కు వీడ్కోలు పలికారు. కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, ఓర్వల్లు ఎస్ఐ సునీల్ ఆధ్వర్యంలో విమానాశ్రయం, హైవేపై బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం

● రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం మౌర్యఇన్‌లో జరిగిన వాసవీ మహిళా మండలి 35వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సతీమణి, వాసవీ మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు టీజీ రాజ్యలక్ష్మి, మంత్రి సతీమణి టీజీ శిల్పా భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ 35 ఏళ్లుగా వాసవీ మహిళా మండలి చక్కని కార్యక్రమాలతో ముందుకు పోతోందని ప్రశంసించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇమేజ్ నేపథ్యంలో కర్నూలు పరిసర ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయలతో పరిశ్రమల ఏర్పాటు జరుగుతోందని వివరించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటును ఏ, బీ, సీ క్యాంపు స్థలాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటూ నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు స్థానికంగానే లభిస్తాయన్నారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్న మంత్రివర్గంలో ఒక్క ఆర్యవైశ్యుడు కూడా లేరని, రాష్ట్ర మంత్రివర్గంలో తనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవకాశం కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా టీజీ భరత్ ప్రస్తావించారు. అనంతరం లక్కీడిప్ తీసి విజేతలకు బహుమతులు ముఖ్యఅతిథులు అందజేశారు.

పేదల సొంతింటి కల సాకారం

● కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారం అయిందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం పట్టణంలో పీఎంఏవై(యూ) 2.0 ద్వారా బిల్లు మంజూరైన లబ్ధిదారుల సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సొంతిల్లు లేని పేదలకు ఇల్లు అందించే బృహత్తర కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు కే.రామాంజనేయులు, సింగిల్‌విండో చైర్మన్ దానమయ్య, డైరెక్టర్ రేమట వెంకటేశ్వర్లు, టీడీపీ కోడుమూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సృజన్ టీడీపీ కౌన్సిలర్లు రేమట సురేష్, కోడుమూరు షాషావలి, బుడ్డంగలి, సీనియర్ టీడీపీ నాయకులు పౌలు, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు తెలుగు శ్రీనివాసులు, ఇన్‌చార్జి కమిషనర్ విజయలక్ష్మి, రెవెన్యూ, హౌసింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్హులకు ఇంటి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, జేసీ

అర్హులందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యం

కల్లూరు, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సకల సదుపాయాలతో ఇళ్లు అందించేలా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో కలిసి ఎమ్మెల్యే 35వ వార్డు గనిగుంతల్లో పీఎంఏవై, ఎన్టీఆర్ గృహకల్ప పథకం కింద మంజూరైన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ విశ్వనాథ్, హౌసింగ్‌శాఖ అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దీపోత్సవం



సామూహిక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

కర్నూలు కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ఉభయ సంధ్యావేళల్లో ఇంటిలోగిళ్లలో మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, ఆ దీపకాంతులను చూస్తూ మురిసిపోతారు. భక్తి శ్రద్ధలతో తులసి కోటలు, దేవతామూర్తుల ముందు కార్తీక దీపాలు వెలిగించి తమ ఆరాధ్య దైవమైన మహాలక్ష్మిని గృహాల్లోకి ఆహ్వానిస్తారు. కార్తీక మాసంలో తెలుగు వారి లోగిళ్లలో సాయంసంధ్య వేళల్లో కార్తీకదీపాలు వెలుగు లీనుతూ సౌభాగ్యానికి ప్రతీకగా నిలుస్తాయి. ఈ మాసంలో మహిళలు సామూహికంగా కలిసి చేసే దీపారాధనలు, దీపోత్సవాలపై ఎంతో ఆసక్తి చూపిస్తారు. నగరంలోని వెంకటరమణ కాలనీలోగల కమల్ రెసిడెన్సీలోని గృహిణులు పవిత్ర కార్తీక మాసంలో తమ సృజనాత్మక శక్తిని చాటుతూ దీపోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం సాయంత్రం మూడు గంటల పాటూ శ్రమించి విభిన్నరూపాల్లో కార్తీక దీపాలు వెలిగించి సంతోషంగా పూజల్లో పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో స్వాగత తోరణం, చుట్టూ ప్రమిదలు చేర్చి పుష్పాలంకరణతో మహాశివ లింగ స్వరూపం, ప్రమిదలు, నవధాన్యాలతో రూపొందించిన విఘ్న నాయకుడు, అందమైన ముగ్గుల మధ్య దీపారాధనలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.







శివలింగ స్వరూపం, వినాయకుడు, ముగ్గు చుట్టూ పెట్టిన కార్తీక దీపాలు

అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దుతాం

● నగరపాలక కమిషనర్ విశ్వనాథ్



టిడ్కో గృహలను పరిశీలిస్తున్న నగరపాలక కమిషనర్ విశ్వనాథ్, అధికారులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగర శివారులో ని ఎన్టీఆర్ కాలనీ టిడ్కో గృహలను అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దుతామని నగరపాలక కమిషన ర్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం ఆయన టిడ్కో గృహలను పరిశీలించారు. మరమ్మతులు, సదుపాయాలు, పనుల నాణ్యతను తనిఖీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టిడ్కో కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి వంటి సదుపాయాలను పూర్తిచేసినట్లు తెలిపారు. ఈనెల 17న 187మంది లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తామన్నారు. మంత్రులు నారాయణ, టీజీభరత్ సమీక్షలో తీసుకున్న నిర్ణయం లో భాగంగా 976 మందికి టిడ్కో గృహాలను అప్పగించాల్సి ఉండగా, తొలుత 187మంది లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. ఎంఈ మనోహర్‌రెడ్డి, టిడ్కో ఈఈ సూర్యనారాయణ, డీఈలు గుప్తా, నరేష్, ఎంహెచ్‌వో నాగశివప్రసాద్, టిడ్కో అధికారి పెంచలయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను జేసీ నూరుల్ ఖమర్ ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో ఈకార్యక్రమం నిర్వహించారు. వారం రోజుల పాటు జరిగే వారోత్సవ కార్యక్రమాలను జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి పెద్దక్క జేసీకి వివరించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో వారోత్సవాలకు తగిన ఏర్పాట్లను ఆమె తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ ప్రసన్నలక్ష్మి, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్ బాషా, భాస్కర్ పాల్గొన్నారు.

వాయుగండ్ల కౌశిక్‌కు సత్కారం



వాయుగండ్ల కౌశిక్‌ను సత్కరిస్తున్న జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నాయకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల డైరెక్టర్‌గా నియమితులైన వాయుగండ్ల కౌశిక్‌ను జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు వెంకటరామరాజు ఘనంగా సత్కరించారు. బుధవారం నగరంలోని భాగ్యనగర్‌లో గల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు దేవీప్రసాద్, లక్ష్మీపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరామరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువతకు ప్రాధాన్యత కల్పించడం శుభపరిణామమని, కర్నూలుకు చెందిన వాయుగండ్ల కౌశిక్‌ను డైరెక్టర్‌గా నియమించడం అభినందనీయమన్నారు. కౌశిక్ మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్ ప్రోత్సాహం, సహకారంతోనే తనకు ఈఅవకాశం లభించిందన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ ఉద్యోగులు



కలెక్టర్‌కు స్పోర్ట్స్ కిట్టును అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఏపీఆర్ఎస్ఏ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు, లక్ష్మీరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు కలెక్టర్ సిరి, జేసీ నూరుల్ ఖమర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురంలో జరిగిన 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ స్పోర్ట్స్ 2025 కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్, లోకేశ్‌రెడ్డి, రామాంజనేయులు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి

సి.బెళగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని ఆర్అండ్‌బీ డీఈ రమణ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకొని మురుగుకాల్వల మీద గృహాలను నిర్మించుకుంటే ఇబ్బంది అన్నారు. టౌన్‌లో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు వేగవంతం జరుగుతున్నాయన్నారు. ఏఈ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.

గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న గైనకాలజిస్టు డా.సాహిత్య జయరాం

కర్నూలు హాస్పిటల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌పై మహిళలు అవగాహన పెంచుకోవాలని గైనకాలజిస్టు డా.సాహిత్య జయరాం అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో సర్వేకల్ క్యాన్సర్‌పై వైద్యుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పొత్తి కడుపు నొప్పి, నెలసరికి మధ్య రక్తస్రావం మెనోపాజ్ తర్వాత రక్తస్రావం ఉండే వైద్యులను సంప్రదించాలని కోరారు. కుటుంబంలో ఎవరి కైనా క్యాన్సర్ ఉంటే 40 సంవత్సరాల లోపు నుంచి ఏడాదికి ఒకసారి స్కానింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. 20సంవత్సరాలు దాటిన వారందరూ పాప్‌స్మెయర్ పరీక్ష చేయించుకోవాలని, క్యాన్సర్ నివారణలో అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డా.మహేశ్వర ప్రసాద్, డా.భాస్కర్ , స్త్రీ వ్యాధి నిపుణులు డా.నికత్ నస్రీన్, దంత వైద్యులు డా.హుడస్సా, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుదాకర్, ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలితో న్యుమోనియాను నివారించొచ్చు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): న్యూమోనియా అనేది శ్వాసకోశ సంబంధిత తీవ్రమైన వ్యాధి అని, కర్నూలు మెడికవర్ హాస్పిటల్ పల్మనాలజిస్టు డా.సువర్ణలక్ష్మి అన్నారు. వరల్డ్ న్యూమోనియా డే సందర్భంగా హాస్పిటల్‌లో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. టీకాలు, ఆరోగ్య కర జీవన శైలి, పర్యావరణ పరిశుభ్రత ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు డా.కే.సింధూర రెడ్డి, డా.వై.గణేష్, డా.అనూషా మాట్లాడుతూ పిల్లల్లో వచ్చే శ్వాస సంబంధిత ఇన్‌ఫెక్షన్లు తేలిగ్గా తీసుకోవద్దని ఈ వ్యాధి నివారణలో వ్యాక్సినేషన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పిల్లలకు సరైన వయస్సులో టీకాలు వేయించడం ద్వారా రక్షణ పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ డా.వై.మహేశ్వరరెడ్డి, వైద్యులు, రోగులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయకండి

● మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆయన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కాటసాని ఇంటి నుంచి చెన్నమ్మ సర్కిల్, ఐటీసీ సర్కిల్ మీదుగా కల్లూరు తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసీల్దారు విష్ణుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేసిన వైసీపీ ప్రభుత్వం 7 కళాశాలలను పూర్తి చేసిందన్నారు. గత ప్రభుత్వంలో రెండేళ్లు కరోనా పోగా మూడు సంవత్సరాల్లో జగన్ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో సంఘం సభ్యత్వ నమోదు



ఏపీ ఎన్జీవో సంఘం సభ్యత్వ నమోదులో సభ్యులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నగర అధ్యక్షుడు కాశన్న ఆధ్వర్యంలో నర్సులకు సచివాలయ ఉద్యోగులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బి.ప్రభాకర్ రెడ్డ, నగర కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి హరికృష్ణ గౌడు, ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లీలావతి, జిల్లా కార్యదర్శి బంగారి, జిల్లా కోశాధికారి లక్ష్మీనరసమ్మ, మరియు నర్సెస్ ఈసీ మెంబర్లు మెడికల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అద్యఓలు ఈశ్వరయ్య, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మహిళా విభాగం నాయకురాలు చందన, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి మద్దిలేటి, బీసీ హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రాజు, హెచ్‌డబ్ల్యూవోస్ రాముడు, కనకలత, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

సి.బెళగల్, నవబంరు 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఎంఈవో ఆదాంబాషా అన్నారు. బుధవారం మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ప్రతి వారం పరీక్షలు నిర్వహించాలన్నారు.

పేదలందరికీ ఇళ్లు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే



కార్యకర్తలతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే శ్యామ్‌బాబు అన్నారు. బుధవారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో మండల కమిటీ, గ్రామ కమిటీ, యూనిట్, క్లస్టర్, బూత్ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదురొడ్డి 2024 ఎన్నికలలో టీడీపీ కార్యకర్తలు పార్టీ గెలుపునకు కృషి చేశారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈలాగే ఐక్యమతంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, అలంకొండ నబి, తిరుపాల్, సుదాకర్ లోకనాథ్ తదితరులు ఉన్నారు.

మండలంలో పర్యటించిన ట్రైనీ ఐఏఎస్‌లు



మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు

మద్దికెర, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ట్రైనీ ఐఏఎస్‌లు బుధవారం పర్యటించారు. సచివాలయాలను పరిశీలించారు. ప్రభుత్వ పాలన ఎలా ఉంది.. ప్రభుత్వ సౌకర్యాలు ఎలా ఉన్నాయనే అంశంపై ఆరా తీశారు. మండలంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో కూడా పనులు బాగా జరుగుతున్నాయని, అధికారులు సమయ పాలన పాటించడమే కాకుండా ప్రజలకు అందుబాటులో ఉన్నారని ట్రైనీ ఐఏఎస్‌లు కితాబు ఇచ్చారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలను కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ట్రైనీ ఐఏఎస్‌లు అంకిత్ రాజ్‌పుత్, మోహిత్ మంగల్, భరత్‌దత్ తివారి, తన్మయి మెగ్వాల్ అమర్ బాగిల్ అతుల్ సోనీ తెలిపారు. వారి వెంట సర్పంచ్ బండారు సుహాసిని, ఎంపీడీవో కొండయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, ఏపీవో నర్సిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరిస్తాం: ఏఈ

మద్దికెర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బెస్తవీధి వడ్డె ప్రాంతంలో నెలకొన్న విద్యుత్ సమస్యను విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆదేశాల మేరకు కాలనీలో ఏఈ పర్యటించారు. విద్యుత్ సమస్య ఉన్న ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నారు. ఆయ న వెంట ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పారా విఠోబ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, పంచాయతీ సభ్యులు జమేదార్ జంబునాథ్ రాయుడు, నాయకులు బొల్లాపురం చంద్ర, గిడ్డయ్య ఉన్నారు.

జీవామృతంతో పొలానికి బలం

తుగ్గలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జీవామృతం పొలానికి బలమని, సేంద్రియ ఎరువులు వాడి భూములను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్ యాదవ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని రాంపల్లిలో ధృవ జీవామృతం, పొలాల సంరక్షణ ఎలా చేపట్టాలనే విధానంపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి

తుగ్గలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడు అన్నారు. బుధవారం తుగ్గలి మండలం క్లస్టర్ ఇన్‌చార్జిగా ఎన్నుకున్న శ్రీనివాస్‌గౌడును ఆ పార్టీ నాయకులు బోలా మల్లికార్జున, బోలా రంగస్వామిలు పూలమాలలు వేసి సన్మానించారు. వారితో పాటు పలువురు నాయకులు సన్మానం చేశారు. కార్యక్రమంలో రవికుమార్, రంగస్వామి ఉన్నారు.

రీసర్వేను పరిశీలించిన డిప్యూటీ డైరెక్టర్

పత్తికొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం పందికోన గ్రామ పరిధిలో జరుగుతున్న రీసర్వేను రీసర్వే డిప్యూటీ డైరెక్టర్ సూర్యారావు బుధవారం పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా రీసర్వేను పూర్తి చేయాలని డీడీ సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ డైరెక్టర్ మునికన్న, డీఐవోఎస్ దేవేంద్రయ్యస్వామి, మండల సర్వేయర్ గాది లింగప్ప ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు స్థలం కేటాయింపు

వెల్దుర్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో గోవర్ధనగిరి, రామళ్లకోట గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలకు స్థలాలను కేటాయించినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ బుధవారం తెలిపారు. ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 1.20 ఎకరాల భూమి కేటాయించామన్నారు. రామళ్లకోట జగనన్న కాలనీలో, గోవర్ధనగిరి సర్వేనెం.249లో ప్రభుత్వ భూమిని గుర్తించి కలెక్టర్ అనుమతులకు పంపినట్లు తెలిపారు.

రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తాం

తుగ్గలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధి కోసం సొసైటీలు కృషి చేస్తున్నాయని ఉప్పర్లపల్లి సొసైటీ అధ్యక్షుడు అప్పా వేణుగోపాల్, సీఈవో గిడ్డయ్య అన్నారు. బుధవారం జొన్నగిరిలో మాట్లాడుతూ సొసైటీలో రైతులకు తక్కువ వడ్డీలకే రుణాలు అందుతున్నాయన్నారు. ఈనెల 14నుంచి సొసైటీ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

గిరిజనులకు రుణాలు అందించాలి

తుగ్గలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఎంతో వెనుకబడి ఉన్నారని, రుణాలు అందించాలని జడ్పీటీసీ పులికొండ నాయక్ కోరారు. బుధవారం జాప్లాతండాలో ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 16 గిరిజన తండాలు ఉన్నాయన్నారు. గిరిజనులు అందరూ వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారని వారి కోసం ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేస్తే చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఇక్కడే జీవనం సాగిస్తారన్నారు.

భక్తుల ఆరాధ్యుడు సుబ్రహ్మణ్యేశ్వరుడు

25 నుంచి షష్ఠి ఉత్సవాలు ప్రారంభం



మద్దికెర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దమ్మకుంట గ్రామ సమీపంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాలు ఈ నెల 25 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు విజయప్రసాద్ యాదవ్ తెలిపారు. ఈ నెల 25న మూల విరాట్ సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు మొదల వుతాయన్నారు. 26న గంగ పూజ, గణపతి పూజ, మహా మంగళహారతి, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందన్నారు. 27న విశేష పూజలు, సుబ్రహ్మణ్యస్వామి హోమం, పూర్ణాహుతి, సాయంత్రం ప్రభోత్సవం, రాత్రి పౌరాణిక నాటకం ఉంటుందని తెలిపారు 28న సుబ్రహ్మణ్యం మహా మంగళహారతి ఉంటుందని, షష్ఠి ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కల్యాణోత్సవం , హోమాల్లో పాల్గొనే భక్తులు ముందుగానే వారి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రతిరోజు మధ్యాహ్నం భోజనాలు ఉంటాయని ఆలయ నిర్వాహకుడు విజయప్రసాద్ యాదవ్ తెలిపారు.

గృహాల ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు

ఆదోని రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తామని ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. బుధవారం వర్చువల్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గృహాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా, ఆదోని మండలం ఢణాపురంలో లబ్ధిదారుడు ఇంటిని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో పాటు సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, తమ కూటమి ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వమన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో ఇంటి స్థలాలులేని వారికి స్థలాలు ఇవ్వ డంతోపాటు పక్కాగా ఇళ్లను కూటమి ప్రభుత్వం నిర్మించి ఇస్తామన్నారు. తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో జనార్దన్, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల గైర్హాజరు : ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన పేదల గృహ ప్రవేశ కార్యక్రమానికి టీడీపీ ముఖ్య నాయకులతోపాటు క్యాడర్ మొత్తం గైర్హాజరయ్యారు. నూతనంగా హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి చేపట్టిన ఆరేకల్లు రామకృష్ణ తన నియోజకవర్గం ఆదోనిలో కాకుండా పత్తికొండలో పాల్గొనడంపై ఆదోని నియోజకవర్గంలో అంతర్గతంగా కూటమిలో కుమ్ములాట కొనసాగుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా ఆ గ్రామ బీజేపీ మద్దతుదారు సర్పంచ్ చంద్రను కూడా ఈ కార్యక్రమానికి పిలవకపోవడంతో అటు అధికారులపై, ఇటు ఎమ్మెల్యేపై విమర్శలు వెల్లువెత్తాయి. కార్యక్రమంలో అధికారులు తప్ప కూటమి నాయకులెవ్వరూ పాల్గొనలేదు.



ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైకుంఠం జ్యోతి

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం: ఎమ్మెల్యే

పత్తికొండ: పేదల సొంతింటి కల నెరవేర్చడం ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం పుచ్చకాయలమాడ గ్రామంలో పక్కా గృహాల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నూతన ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే 3 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులతో గృహప్రవేశాలు ప్రభుత్వం చేయించిందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతిళ్లు కేటాయించేంత వరకు ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో భరత్‌నాయక్, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సింగిల్‌విండో అధ్యక్షుడు చందోలి రంగప్ప, ఎంపీడీఓ కవిత, గృహనిర్మాణశాఖ అధికారులు, లబ్ధిదారులు ఉన్నారు.

సొంతింటి కలను నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి

ఆలూరు రూరల్: అర్హులైన పేదలందరికీ సొంతింటి కల సహకారం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గృహాలను బుధవారం జ్యోతి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వైకుంఠం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు తరాల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో 947 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని, అర్హులైన పేదలు స్థలం ఉండి ఇళ్లను నిర్మించుకోవాలంటే పీఎంఏవై కింద దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అథోగతి పాలు చేసిందని, అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచ దేశాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు చూస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, హౌసింగ్ డీఈ విజయ్‌కుమార్, ఎంపీడీవో మద్దిలేటిస్వామి, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, కిషోర్, రెహమాన్, టీడీపీ నాయకులు చంద్ర, తులసిమూర్తి, ఈరన్న, షేక్షావలి, విశ్వేశ్వరయ్యస్వామి, జగదీష్‌స్వామి, గురుస్వామి, ఖాదర్, రామాంజనేయులు, హనుమప్ప, అధికారులు పాల్గొన్నారు.



ఢణాపురంలో గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

'రైతులను విస్మరిస్తే ప్రభుత్వానికి గుణపాఠం'



జీపు జాతాను ప్రారంభిస్తున్న రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులను విస్మరిస్తే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి రామచంద్రయ్య హెచ్చరించారు. బుధవారం ఈనెల 18 నుంచి ఆదోనిలో జరిగే పత్తి రైతుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జీపు జాతాను ఆయన జండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించిన షరతులతో పత్తిని రైతులు అమ్ముకోలేకపోతున్నారన్నారు. షరతులు లేకుండా రైతులు నుంచి క్వింటాలు రూ. 12 వేలు కనీస మద్దతు ధర పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, పంపన్న గౌడ్, పట్టణ కార్యదర్శి వీరేష్, రాజా సాహెబ్, సుదర్శన్, తిమ్మయ్య, బసాపురం గోపాల్, రాజు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. ముగ్గురికి గాయాలు

ఆలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరికెరలో బుధవారం సాయంత్రం ఒకే సామాజికవర్గానికి చెందిన ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. కర్రలు, మారణాయుధాలతో అరికెర వెంకటేశ్వర్లు ఇంటి వద్దకు దిబ్బల మహేష్ వర్గం వారు దాడి చేశారు. ఈ దాడిలో అరికెర వెంకటేశ్వర్లకు స్వల్ప గాయాలు కాగా, ఆయన కుమారుడైన ధనుంజయ్, సోదరుడి కుమారుడు గిరిదాస్‌కు చెయ్యి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఇద్దరిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యులు రెఫర్ చేశారు. వివరాలివీ.. అరికెర గ్రామానికి చెందిన దిబ్బల నాగేంద్ర కుమార్తెను, అరికెర వెంకటేష్ సోదరుడు రామ్‌దాస్ కుమారుడు గణేష్ మధ్య ప్రేమ వ్యవహారం సాగింది. ఈనెల 7న ఇంట్లో నుంచి వారిద్దరూ వెళ్లిపోయి పెద్దలకు తెలియకుండా తిరుపతిలో వివాహం చేసుకున్నారు. ఇదే వ్యవహారంలో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. పోలీసులు ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు తీసుకుని దిబ్బల మహేష్ వర్గం, అరికెర వెంకటేశ్వర్లు వర్గీయులపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ మన్మథవిజయ్ గ్రామానికి చేరుకుని గ్రామస్తులకు సూచనలు చేశారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం కోసం సహకరించాలని కోరారు.

ఘర్షణలో పలువురికి తీవ్ర గాయాలు

పత్తికొండ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భూ తగాదాల కారణంగా రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు... గ్రామానికి చెందిన నౌనేపాటి, నారాయణ అన్నదమ్ముళ్లు. అయితే వీరి మధ్య భూ వివాదం నెలకొంది. బుధవారం నౌనేపాటి కుమారుడు జయరాముడు, కోడలు రామాంజినమ్మ, భార్య ఉచ్చీరమ్మలు పొలం పనులకు వెళ్లారు. అదే సమయంలో నారాయణ, నారాయణ కుమారుడు నౌనేపాటి పొలం వద్దకు వెళ్లారు. ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ తలెత్తింది. వేట కొడవళ్లతో దాడి చేసుకున్నారు. జయరాముడు, రామాంజినమ్మ, ఉచ్చీరమ్మ లకు తీవ్ర గాయాలయ్యాయి. మరో వర్గమైన నారాయణకు కూడా గా యాలయ్యాయి. గాయపడిన వారిని పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. రామాంజినమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

ఆదోని రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదోనికి చెందిన వాహన డ్రైవర్ కళ్యాణ్ స్వామిపై ఇస్వీ పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం ఆదోని మండలం ఢణాపురం శివారుల్లో ఆదోనివైపు వస్తున్న ఎద్దుల బండిని కళ్యాణ్ స్వామి కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో రైతు కరెప్ప తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆదోనిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ మహేష్ కుమార్ తెలిపారు.

అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా శిరీష బాధ్యతలు

ఆదోని టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పట్టణ ప్రణాళిక విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా శిరీష బుధవారం పదవి బాధ్యతలను చేపట్టారు. చాలా కాలంగా ఏసీపీ పోస్టు ఖాళీగా ఉంది. అనంతపురం కార్పొరేషన్‌లో టీపీవోగా విధులు నిర్వహిస్తున్న శిరీష అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పదోన్నతి పొంది ఆదోని మునిసిపాలిటీకి బదిలీపై వచ్చారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

పత్తికొండ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రయ్య, పంపన్నగౌడ్ డిమాండ్ చేశారు. ఆదోని పట్టణంలో ఈనెల 18, 19వ తేదీల్లో జరిగే పత్తి రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన జీపుజాతా బుధవారం పత్తికొండకు చేరుకుంది. నాలుగు స్తంభాల కూడలిలో వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర లేక రైతులు తీరని మోసానికి గురవుతున్నారన్నారు. ఈనెల 18, 19వ తేదీల్లో ఆదోనిలో జరిగే సమ్మేళనంలో పత్తి రైతులు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. కౌలు రైతుసం ఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, సురేంద్రకుమార్, కారుమంచి, రామాంజనేయులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి అమానుషం

ఆలూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పుత్తూరులో న్యాయవాది రాజశేఖర్‌పై దాడి చేయడం అమానుషమని ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీకాంత్, మాధవకృష్ణ అన్నారు. న్యాయవాది రాజశేఖ ర్‌పై దాడికి నిరసనగా బుధవారం ఆలూరులో న్యాయవాదులు విధులు బహిష్కరించి అంబేడ్కర్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు హెచ్‌కే రవి, శ్రీదర్, రంగప్ప, షాకీర్, వీరేష్, చాంద్‌బాషా, విజయభాస్కర్, రాజేష్‌నాయుడు, తిమ్మయ్య, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: నిత్యం ఏదో ప్రాంతంలో న్యాయవాదులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని అమలు చేయాలని పత్తికొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మధుబాబు డిమాండ్ చేశారు. తిరుపతిలో సీనియర్ న్యాయవాది రాజశే ఖర్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం పత్తికొండలో నాలుగు స్తంభాల కూడలిలో న్యాయవాదులు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సురేంద్రకుమార్, దామోదర ఆచారి, ఎల్లారెడ్డి, మైరాముడు, సూరజ్ పాల్గొన్నారు

నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

మద్దికెర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని టీడీపీ నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం ఉపాధ్యక్షుడు మంగళి రంగస్వామి కోరారు. మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన రంగస్వామి మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం అధ్యక్షుడు బాల గురుస్వామికి ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలని కోరారు.

ఆరోగ్య కేంద్రాలకు నిధులు మంజూరు

దేవనకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదు గ్రామాలలో ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలకు నిధులు మంజూరయినట్లు డిప్యూటీ ఎంపీడీవో గోపాల్, పీఆర్ ఏఈ ఉదయ్ తెలిపారు. ఐరన్‌బండ, పోట్లపాడు గ్రామాలలో 15వ ఆర్థికసంఘం నిధుల ద్వారా ఒక్కో ఆరోగ్య కేంద్రానికి రూ. రూ.36 లక్షలతో నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే దేవనకొండ, కప్పట్రాళ్ల, గుండ్లకొండ గ్రామాలలో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం-ఏబీహెచ్ ఐఎం) నిధుల కింద ప్రతి కేంద్ర నిర్మాణానికి రూ.42 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. అలారుదిన్నే, కరివేముల ఆరోగ్య కేంద్రాల నిర్మా ణాలు అసంపూర్తి ఉండటంతో నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో పెండింగ్ పనులు పూర్తి చేయుటకు నిధులు మంజూరయినట్లు వారు తెలిపారు.

పత్తి రైతుల సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

ఆస్పరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదోనిలో ఈనెల 18, 19వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళనం జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.నాగేంద్రయ్య, పంపన్నగౌడ్ అన్నారు. బుధవారం వారు ఆస్పరిలో మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పత్తి పంట పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఒక క్వింటానికి రూ.12 వేలు ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజాసాహెబ్, సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షులు రంగన్న, రైతు సంఘం నాయకులు ఆంజనేయ, ఉరుకుందప్ప, బ్రహ్మయ్య, హనుమంతు, నల్లన్న పాల్గొన్నారు.

కుష్ఠు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ఆదోని రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలును కుష్ఠు రహిత జిల్లాగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిపై ఉందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి తెలిపారు. బుధవారం ఏరియాసుపత్రిలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈనెల 17నుంచి ఇప్పటి వరకు ఎల్‌సీడీసీ సర్వే నిర్వహించాలని, దీని వల్ల కుష్ఠి వ్యాధి అనుమానితులను గుర్తించి వారికి మందులు ఇవ్వాలని సూచించారు. కర్నూలు న్యూక్లియస్ మెడికల్ అధికారి మల్లికార్జునరెడ్డి, డాక్టర్ శైని, చంద్రశేఖ ర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల నిర్మాణానికి భూమి పూజ

ఆదోని టౌన్ , నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 23వ వార్డు భీమిరెడ్డి కాలనీలో ఉర్దూ పాఠశాల నిర్మాణం కోసం ఎమ్మెల్యే డా. పార్థసారథి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఆయన మాటాడుతూ ఈ ప్రాంతంలో మైనారిటీ కుటుంబాలు అధిక సంఖ్యలో ఉండటం, ఉర్దూ పాఠశాల కావాలని మైనారిటీ అడగడంతో పాఠశాల నిర్మాణం కోసం స్థలం కేటాయిస్తూ సర్వ శిక్ష అభియాన్ ద్వారా రూ. 13 లక్షలు మంజూరు చేయించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, బీజేపీ నాయకులు వెల్లాల మధుసూదన్ శర్మ, మహబూబ్ బాషా, పగడాల కిరణ్, పూల రఘు, ఏఈ ఖాజా మోయినుద్దీన్ పాల్గొన్నారు.

ఆరుబయట చదువులు వద్దు

ఆలూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆరుబయట చదువులు లేకుండా చర్యలు తీసుకుంటామని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. బుధవారం హత్తిబెళగల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వైకుంఠం జ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, తాగునీటి సమస్య, ఆట స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వైకుంఠం జ్యోతికి మొరపెట్టుకున్నారు. వెంటనే స్పందించిన ఆమె విద్యాశాఖ అధికారులకు ఫోన్ చేసి పాఠశాల విద్యాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. పాఠశాల విద్యాభివృద్ధికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ ఆర్గనైజింగ్ శీనప్ప, బెంగళూరు కిషోర్, రెహమాన్, ఎంపీడీవో మద్దిలేటిస్వామి, ఈరన్న, షేక్షావలి, మూర్తి, చంద్ర పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

దేవనకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జనసేన నాయకుడు ఉచ్చీరప్ప అన్నారు. జనసేన నాయకురాలు సరోజకు ఆలూరు మార్కెట్‌యార్డు డైరక్టర్‌గా నియమించడంతో, జనసేన పార్టీ నాయకులు దేవనకొండలో ఆమెని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజినేయులు, బాలకృష్ణ, కృపాకర్, నాగరాజు, చంటి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు పరామర్శ

ఆదోని రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం అస్వస్థతకు గురై ఆదోని ఏరియాసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగలాపురం అంగన్‌వాడి చిన్నారులు సుదర్శన్, వైశ్యాలిని టీడీపీ పట్టణ అధ్యక్షుడు బోయ తిమ్మప్ప, సీనియర్ నాయకులు రామస్వామి, గణేకల్లు విరుపాక్షి, పాండవగల్లు అయ్యన్న, నెట్టేకల్లు మహేష్‌లు పరామర్శించచారు. వారి కుటుంబాలకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారు మాట్లాడుతూ, అంగన్‌వాడి కేంద్రాలను తరుచూ అధికారులు తనిఖీ చేయాలని, నాణ్యమైన పాలను, భోజనాన్ని విద్యార్థులకు అందేలా చూడాలని కోరారు.

తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలి

దేవనకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బండగట్టు నీటి పథకం ద్వారా గ్రామాలకు నీటి సరఫరాను సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ మనోహర్ తెలిపారు. మండలంలోని బండగట్టు వాటర్ పంప్‌హౌస్‌ను బుధవారం ఎస్ఈ తనిఖీ చేశారు. ఫిల్టర్‌బెడ్‌లు, ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించి, శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పైపులు లీకేజీల సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా, వేగంగా మరమ్మతులు చేపట్టి గ్రామాలకు నీటి సరఫరా జరిగేలా చుడాలన్నారు. డీఈ మహబుబ్‌ఖాన్, బండగట్టు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి


వెల్దుర్తి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలో సుమారు 19,359 వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకులుగా పని చేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం అధికారులకు వీఆర్‌ఏలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నెల 17న కలెక్టర్ కార్యాలయం వద్ద సామూహిక రాయబార కార్యక్రమం నిర్వహిస్తామని, జయప్రదం చేయాలని కోరారు. షేక్ బందగి సాహేబ్, కే.రవికుమార్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం: వైసీపీ

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయం నుంచి పురవీధుల మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు బుధవారం వైసీపీ కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, వైస్ చైర్మన్ నరసింహులు నాయకులు చంద్రకాంత్ రెడ్డి, ఫయాజ్ అహ్మద్, జీవన్ సింగ్, కామాక్షి తిమ్మప్ప, శ్రీలక్ష్మి, రామలింగేశ్వర యాదవ్, ఏసేపు పాల్గొన్నారు.

ఆలూరు: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కుట్ర పన్నుతోందని, ప్రైవేటీకరణను రద్దు చేయాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, వైసీపీ నేత వైకుంఠం మల్లికార్జునచౌదరి డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆలూరు పట్టణంలో ప్రజా ఉద్యమం పేరుతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు దొరబాబు, కిట్టు, వైసీపీ నాయకులు తెర్నేకల్ సురేంద్రరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మండల కన్వీనర్ మల్లికార్జున, బసవరాజు, నాయకులు భాస్కర్, వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను రద్దు చేయాలని వైసీపీ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే స్వగృహం నుంచి వైసీపీ శ్రేణులు పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు స్తంభాల కూడలిలో ఉన్న మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, ఎంపీపీలు నారాయణదాస్, వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ ఉరుకుందమ్మ, నాయకులు బాబుల్‌రెడ్డి, సోమశేఖర్, శ్రీరంగడు పాల్గొన్నారు.



ఆదోనిలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

సొంతింటి కల సాకారంతో సంతోషం

● అర్హులందరికీ ఇళ్లు అందించడానికి ప్రభుత్వం కృషి ● గృహాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి, నాయకులు



గోనెగండ్లలో తాళం చెవిని అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

గోనెగండ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సొంతింటి కల సాకారం కావడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గోనెగండ్లలోని 2వ వార్డులో పీఎంఏవై కింద నిర్మించుకున్న ఇంటిని బుధవారం ఆయన ప్రారంభించారు. లబ్ధిదారురాలికి తాళం చెవిని ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంతిళ్లు లేని పేదలకు ఇంటిని నిర్మించి ఇస్తామని ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. ప్రస్తుతం గోనెగండ్లలో 138 గృహాల నిర్మాణాలను పూర్తి చేశారని తెలిపారు. గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అందులో బాగంగా రూ. 2.50 కోట్లుతో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఎంపీడీవో మణిమంజరి, టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, అడ్వకేట్ చంద్రశేఖర్, మహల్ రహంతుల్లా, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, రామాంజినేయులు, బడేసా, షేక్షావలి, హరికృష్ణ, రాజేష్, రెహంతుల్లా, రఫీక్, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, జనసేన ఇన్‌చార్జి, రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బి.లక్ష్మన్న అన్నారు. మండలంలోని మాధవరం గ్రామంలో గృహాన్ని డీపీవో భాస్కర్, హౌసింగ్ డీఈ లాల్‌కృష్ణయ్య, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో నూర్జహాన్, డిప్యూటీ ఎంపీడీవో రామాంజినేయులు, గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటికి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావడి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ ఆర్‌జలక్ష్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్ఎం గోపాల్‌రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి బొర్కి ఉరుకుందు, కమ్మరి ఉరుకుందు, శివరాం, గోపాల్, చావడి జయరాం, రాఘవేంద్ర, నరసింహులు, నాగరాజు, సురేష్, నర్సారెడ్డి, విష్ణువర్ధన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాధవరంలో గృహ ప్రారంభోత్సవంలో పాల్గొన్న టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

బసాపురంలో ప్రారంభించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మండలంలోని 52 బసాపురంలో ప్రభుత్వం నిర్మించిన బోయభీమక్క ఇంటిని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. వైసీపీ మండల అధ్యక్షులు గుర్రెడ్డి భీమిరెడ్డి, దశరథ రెడ్డిలకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పల్కారు. హౌసింగ్ అధికారులు రాజేష్, వీరేంద్ర, సోమప్ప,ఈరన్న, సాహితి ఆధ్వర్యంలో ఇంటికి పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నరసప్ప, నాగరాజు, దేవేంద్ర, డాక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు


హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ జయనాగ్వేరరెడ్డి దంపతులు

ఎమ్మిగనూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో 87వ విశ్వశాంతి మహాయాగంలో భాగంగా బుధవారం మహాలక్ష్మి, అష్టలక్ష్మి హోమాలను నిర్వహించారు. ఈ హోమాల్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి దంపతులు పాల్గొని హోమాలు నిర్వహించి పూజలు చేశారు. అలాగే మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు చంద్రశేఖర్ దంపతులు పాల్గొని హోమాలు నిర్వహించారు. అలాగే సామూహిక హోమాల్లో పలువురు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. హోమాల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు, శ్రీ కృష్ణ మఠం పీఠాధిపతి స్వరూపానంద స్వామిజీ తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అలాగే సాయంత్రం యాగశాల నుంచి పట్టణపుర వీధుల గుండా శోభ యాత్రను కన్నులపండువగా నిర్వహించారు. శోభాయాత్రలో ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వర రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ గింగిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, టీడీపీ, బీజేపీ నాయకులు మహేశ్, నరసింహులు, భక్తులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకోత్సవం


స్వర్ణ పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

మంత్రాలయం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం రమణీయంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మఠంలో బుధవారం కార్తీక అష్టమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారు కవచంతో చూడముచ్చటగా అలంకరించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్ఠించి రమణీయంగా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో మంత్రాలయం కిక్కిర్సింది.

● మంత్రాలయం రాఘవేంద్ర స్వామి పరమ గురువులైన పూర్వపు పీఠాధిపతులు రఘునందన తీర్థుల మధ్యారాధన మహోత్సవాలు కన్నుల పండువుగా నిర్వహించారు. కర్ణాటక లోని హంపిలో వెలసిన రఘునందన తీర్థుల బృందావనానికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు, వెండి ఆభరణాలతో పాటు, పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారికి హస్తోదకం చేసి పీఠాధిపతి మహా మంగళ హారతి ఇచ్చారు. అక్కడే సంస్థాన పూజలో భాగంగా మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. వాదిరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ ఆచార్, రాజా ఎస్ అప్రమేయాచార్.పవన్‌ఆచార్, మురళిస్వామి పాల్గొన్నారు.

పని వేళలు పాటించకపోతే చర్యలు

● జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్

నందవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అధికారులు సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ హెచ్చరించారు. నదికైరవాడి గ్రామంలో బుధవారం అదనపు ఎంపీడీవో సందీప్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహణ గురించి ప్రజలకు అవగాహన కల్పించి వారి దగ్గర నుంచి అర్జీలు స్వీకరించారు. డీపీవో మాట్లాడుతూ సర్వే రికార్డుల నిర్వహణ 9(2) 10ల ఇంటి యజమానులకు అందజేసే ఈ సర్వే ప్రాధాన్యత, వీటి ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. గ్రామ సభలో కొందరికి 9(2) నోటీసులను ఇంటియజమానులకు ఇవ్వడంతో పాటు కచ్చితంగా కొలతలతో కూడిన నోటీసులు ఇవ్వడంలో ఎలాంటి జాప్యం లేకుండా సరైన రికార్డులను ప్రజలకు అందజేయడానికి సచివాలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరమ్మ, టీడీపీ క్లస్టర్ ఇన్‌జార్జి వీరేష్ పాల్గొన్నారు.

శిథిలమైన వాటర్ ట్యాంకు కూల్చివేత


జంపాపురంలో ట్యాంకును కూల్చివేస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ సమీపంలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరడంపై ఈనెల 10న 'వాటర్ ట్యాంక్ శిథిలం' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. కలెక్టర్ డా.ఎ.సిరి, టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి స్పందించడంతో బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజ, డీఈఈ శ్రీనాథరెడ్డి, ఏఈఈ తిమ్మరాజు ఆధ్వర్యంలో శిథిలమైన ఓవర్‌హెడ్ ట్యాంకును ఎక్స్‌వేటర్‌తో కూల్చివేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో గ్రామంలో బసవేశ్వరస్వామి జాతర జరుగుతుందని, అప్పటిలోపు నూతన ట్యాంకు నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆంధ్రజ్యోతికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో బాబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేయాలని, బోధనేతర పనుల నుంచి తొలగించాలని, పీఆర్సీ కమిషన్ నియమించాలని, మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్టీయూ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఎం.తులసిరామ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.చంద్రశేఖర్, ట్రెజరర్‌గా కె లక్ష్మన్న, మహిళా కన్వీనర్‌గా ఎం.గాయత్రి ఎన్నికయ్యారు. వెంకటరాముడు, యల్లప్ప, అడివన్న, జగదీష్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

'బాధిత కుటుంబాలను ఆదుకుంటాం'

మంత్రాలయం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం, బసాపురం గ్రామాలకు చెందిన శివకుమార్ తనయుడు సంపత్‌కుమార్, నాగరాజు అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో వారిని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, గుర్రెడ్డి భీమిరెడ్డి, దశరథరెడ్డి పరామర్శించారు. బుధవారం వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసున్నారు. నాయకులు ప్రహ్లాదాచార్, గోరుకల్లుకృష్ణ, జనార్దన్‌రెడ్డి, కురువ మల్లికార్జున, బొంబాయి శివ, వీరారెడ్డి, శీను ఉన్నారు.

మంత్రాలయం సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించాలి

మంత్రాలయం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గ సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించాలని బహుజన సమైఖ్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్ అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై అవగాహన సదస్సు ఏపీఎం రాజశేఖర్, రామలింగడు, ఖాజా, బసన్న, రామాంజనేయులు, చాముండేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్, సీసీరోడ్లు, డ్రైనేజీ, పరిశ్రమలు, విద్య, వైద్యం వంటి అంశాలపై చర్చించారు. ఆర్డీఎస్, గుండ్రేవుల, పులికనుమ, గురురాఘవేంద్ర ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించి వలసలు నివారించుకోవచ్చని అన్నారు. సమావేశంలో పద్మావతి, జోసఫ్, నాగమ్మ, నాగవేణి, ఈశ్వరప్ప, అంజని రంగనాథ్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించే దాకా పోరాటాలు'

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిస్కారం అయ్యే వరకు ఉద్యమాలు తప్పవని ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ అన్నారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని బుధవారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో విధులు నిర్వహిస్తూ మరణించిన కార్మిక కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోకుండా మున్సిపల్ కమిషనర్ వేధిస్తున్నారని ఆరోపించారు. 2021 మున్సిపల్ కౌన్సిల్‌లో చనిపోయిన కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలని తీర్మానం చేసి ఇప్పటి వరకు కార్మికలను విధుల్లోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు యల్లప్ప, శివ, ప్రసాద్, కిరణ్, అగస్టీన్, రామకృష్ణ పాల్గొన్నారు.

పత్తి రైతులు నష్టపోకుండా చూడాలి

గోనెగండ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం క్వింటం పత్తిని రూ. 12వేల ప్రకారం పత్తిని కొనుగోలు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పంపన్నగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజాసాబ్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు మద్దిలేటి నాయుడు కోరారు. బుధవారం గోనెగండ్లలో జీపు జాతా కార్యక్రమం చేపట్టారు. గోనెగండ్లలోని పలు గ్రామాలలో పర్యటించారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దాదాపు ఆరు లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేశారని, ఎకరాకు రూ. 80వేల పైగానే పెట్టు బడులు పెట్టి పండిచారని చెప్పారు. అధికవర్షాల కారణంగా పత్తి పంట పూర్తి గా దెబ్బతిన్నదని రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. పత్తి రైతును కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. ఈనెల 18,19 తేదిలలో ఆదోని లో జరుగుతున్న పత్తి రైతుల సమ్మేళనం లో పత్తి రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనుష్, తెలుగు కిష్టన్న, మండల సహాయ కార్యదర్శి శ్రీరాములు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పార్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు'


మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ సురేశ్ నాయుడు

కౌతాళం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఒక క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, పార్టీ నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా క్రమ శిక్షణ చర్యలు తప్పవని టీడీపీ మండల కన్వీనర్ సురేశ్ నాయుడు హెచ్చరించారు. కౌతాళంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే మండల కమిటీ, జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీల దృష్టికి తీసుకురావాలే గాని, ఎలాంటి ఆధారాలు లేకుండా రాఘవేంద్రరెడ్డి గురించి కొందరు బహిరంగంగా ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. ఇది క్రమశిక్షణ ఉల్లంఘన అవుతుందని అన్నారు. అనంతరం కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు వెంకటపతిరాజు మాట్లాడుతూ పార్టీ ఇన్‌చార్జిపై ఉద్దేశపూర్వకంగా అవినీతి ఆరోపణలు చేయడం దారుణమని అన్నారు. సమావేశంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కురువ వీరేష్, నాయకులు మూకన్న, గిరి, సుభాన్, నరసప్ప, మహదేవ, రంగస్వామి, నాగిరెడ్డి, లింగేష్‌లు ఉన్నారు.

వలస కూలీల కుటుంబాలను ఆదుకోవాలి

కోసిగి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం వలస వెళ్లిన వలస కూలీలు అకాల మృత్యువాత పడటంతో బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిక్కన్న, కోసిగి మండల నాయకులు నాగేంద్ర, సీపీఎం నాయకులు రాముడు కోరారు. మండల పరిధిలోని ఆర్లబండ గ్రామానికి చెందిన దుద్ది హరికృష్ణ, మూగలదొడ్డి గ్రామానికి చెందిన బోయ వెంకటరెడ్డిలు వలస వెళ్లి అక్కడ మృతి చెందడంతో ఆ కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ హరికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రంథాలయాలను విద్యార్థులకు చెరువ చేయాలన్న ముఖ్య ఉద్దేశంతో వారోత్సవాలను చేపడుతోందని, విద్యార్థులు ఇందులో భాగం కావాలని పిలుపునిచ్చారు. బాలల దినోత్స వాన్ని పురస్కరించుకొని వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి: ఏపీటీఎఫ్



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

పెద్దకడబూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ఏపీటీఎఫ్ నాయకులు మురళీకృష్ణ, వీరేష్ డిమాండ్ చేశారు. పెద్దకడబూరులోని ఎమ్మార్సీ సెంటర్‌లో బుధవారం ఏపీటీఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వీరేష్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఉరుకుందు, కార్యవర్గ సభ్యులుగా జహీర్, అబ్బాస్, బసవరాజు, కృష్ణ, గణేష్‌ను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల ఉపాధ్యాయులు పెన్షనర్ల సమస్యలను పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. 12వ పీఆర్‌సీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో రాజేష్ బాబు, గోపాల్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


లక్ష్మీదేవమ్మ (ఫైల్)

గోనెగండ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేలటూరు గ్రామానికి చెందిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలివీ.. గత నెల 25న గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను పాఠశాల నుంచి గ్రామాలకు చేర్చారు. అనంతరం ఆ బస్సు తిరిగి వెళ్లేటప్పుడు పెద్దనేలటూరు గ్రామం నుంచి ముగ్గురు ప్రయాణికులు ఎక్కారు. గ్రామ శివారులో ఎదురుగా ఎద్దుల బండి రావడంతో తప్పించే క్రమంలో బస్సు అదుపుతప్పి ఒకవైపు ఒరిగింది. ఈ క్రమంలో బస్సులో ఉన్న బోయ లక్ష్మీదేవమ్మ(60) కుడికాలుపై స్టెప్నీ టైర్ పడటంతో ఆమె కాలు విరిగి కోమాలోకి వెళ్లిపోయింది. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. లక్ష్మీదేవమ్మకు భర్త శేషప్పనాయుడు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కౌతాళం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 10 ట్రాక్టర్లను బుధవారం కౌతాళం తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి పట్టుకున్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రీచ్‌ల నుంచి కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు తమకు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి అక్రమంగా తరలిస్తున్న 10 ఇసుక ట్రాక్టర్లను ఎరిగేరి గ్రామం వద్ద పట్టుకుని కార్యాలయంకు తరలించినట్లు తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లపై జరిమానాలు వేసి కేసు నమోదు చేస్తామన్నారు. ఈ నెల 6న ఆంధ్రజ్యోతిలో ఇసుకను తోడేస్తున్నారు అనే శీర్షికకు తహసీల్దార్ స్పందించి అక్రమ ఇసుక రవాణదారులపై చర్యలు తీసుకొని 10 ట్రాక్టర్లను పట్టుకున్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్ఎన్ఎస్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న వడ్డే చత్రపతి రాష్ట్ర యోగా పోటీలకు ఎంపికయ్యినట్టు హెచ్ఎం శోభారాణి తెలిపారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో విద్యార్థి చత్రపతిని ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఇటీవల కర్నూలులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 14 విభాగం జిల్లా స్థాయి యోగా ఆర్టిస్టిక్ విభాగం పోటీల్లో విద్యార్థి చత్రపతి ఉత్తమ ప్రతిభకనబరచి ఈనెల 24, 25 తేదీలలో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు వెంకటేష్, బసవరాజు, సృజనా కుమారి, ఉపాధ్యాయులు భీమేష్, ఆంజనేయులు, రాజశేఖర్, విజయ్, రామాంజ నేయులు, నాగరాజు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

ఎమ్మిగనూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డి, టీపీవో రాజేష్ హెచ్చరించారు పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో బుధవారం అక్రమ కట్టడాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన గృహ యజమానులు తమ గృహాలు, ఇతర వ్యాపార సముదాయలను బీపీఎస్ ద్వారా సక్రమం చేసుకునేలా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అవకాశాన్ని గృహ యజమానులు, భవన యజమానులు సద్వినియోగం చేసుకొని అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా శిల్పా కాలనీ, ఎద్దుల మార్కెట్, మైనార్టీ కాలనీ, మునెప్ప నగర్ పలు కాలనీల్లో అక్రమ నిర్మాణాలు చేసుకున్నట్టు అధికారులు గర్తించినట్లు తెలిపారు. వీరంతా వెంటనే బీపీఎస్ ద్వారా తగిన ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

15న జామియా మసీదులో సమావేశం

ఎమ్మిగనూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జామియా మసీదులో ఈనెల 15న సమావేశం నిర్వహిస్తున్నట్లు జామీయ మసీదు అధ్యక్షులు కొండమీద శాబీర్, కార్యదర్శి షేక్ ఉసేన్ సాహెబ్‌లు బుదవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని మసీదు, మదర్సాల ప్రసిడెంట్లు, కార్యదర్శులు, ఇన్‌చార్జీలు తప్పకుండా హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఉమ్మీద్ యాప్, డిజిటల్ రిజిష్ట్రేషన్ గురించి క్లుప్తంగా విషయాలు తెలియజేస్తామన్నారు. ప్రతి ఒక్కరు ఎమ్మిగనూరు జామీయమాసీదులో జరుగు సమావేశానికి బాధ్యతగా హాజరుకావాలన్నారు.

అన్నదాతలు జాగ్రత్తలు తీసుకోవాలి

గోనెగండ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలలో అధిక దిగుబడులు సాధించాలంటే ముందస్తు జాగ్రత్తలు ఎంతో అవసరం అని అధిక దిగుబడులకు అదే మార్గం అని ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హైమలత అన్నదాతలకు సూచించారు. బుధవారం కులుమాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించారు. గ్రామంలో సాగుచేసిన మొక్కజోన్న, వేరుశనగ, మిరప, పంటలను వారు పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పులిరాజు, అరుణ, ప్రకాష్, రైతులు వెంకటేష్, రామాంజినేయులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు: వైసీపీ



మంత్రాలయంలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు



ఎమ్మిగనూరులో ర్యాలీ చేస్తున్న ఇన్‌చార్జి, నాయకులు

మంత్రాలయం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. వైద్య, విద్య కళశాలలు, ప్రజావ్యతిరేక విధానాలకు ప్రజల పక్షాన పోరాటంలో భాగంగా గురువారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మంచాల సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పురుషోత్తంరెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు గుర్రెడ్డి భీమిరెడ్డి, జిల్లా కార్యదర్శి సీవీ విశ్వనాథరెడ్డి, మురళిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, దశరథరెడ్డి, బూదూరు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో మాధవరం నుంచి మంత్రాలయం వరకు భారీ ఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. రాఘవేంద్రసర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు రోగప్ప, బొజ్జప్ప, వీరేష్, సర్పంచ్ భీమయ్య, మల్లికార్జున, లక్ష్మిరెడ్డి, ప్రహ్లాదాచార్, గురురాజారావు, రామ్మోహన్ రెడ్డి, బెట్టన్నగౌడు, నాగరాజు గౌడు, వీరన్న స్వామి, కృష్ణ, పరమేశ్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని వైసీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి రాజీవ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో అన్నమయ్య సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్మాణాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, బషిరెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, బుట్టారంగయ్య తదితరులు పాల్గొన్నారు.